వెల కట్టలేని
మీ ఆనందానికి
15 రూపాయలు
ఓ లెక్కేనంటారా?

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక
సెప్టెంబర్-2013
₹15/-





నవ్వుకోడానికి అడ్డంకులను తొలగించే
హాస్యరసాధీసుడు గణేషుడు!
ఆ స్వామి దీవెనలే మనకు

లాఫ్‌లైన్


నేను మినిస్టర్ తాలూకా అని చెప్పినా
వినిపించుకోకుండా మొండిగా
తీసుకొచ్చారు.. ఇదిగో ఆయన్తోనే మాట్లాడు!!
నరకం


గయ్యాళి అత్త
వయ్యారి కోడలు
ఇప్పుడే సీరియల్లో అత్తను
కోడలు చావచితక్కొట్టింది!
ఈ లెక్కన నేను నిన్నెన్ని తమిళం
సీరియల్లో చూస్తానో!!


పొద్దున్నే నక్క తోకనుకుని
కుక్క తోకను తొక్కాను!!


అలా ఒకరికొకరు జోకులేసుకుంటూ
పగలబడి నవ్వుకుంటుంటే నాకు
డౌటొచ్చింది.. వాళ్ళు భార్యాభర్తలయ్యుంటారని!!


దొంగల సంక్షేమ నిధికి
ఓ వెయ్యి రూపాయలు
చందా రాయండి బాస్!!


ఆరుగంటలకు నిరాహారదీక్ష విరమిస్తాం!
ఆహారానికి కుందేలు కబాబ్స్
దుప్పి.. నెమలి మాంసాలతోపాటు
జింక రెడీచేసుంచు!!
వన్యప్రాణ సంరక్షణకోసం
శ్రీదుష్టప్పగారి నిరాహారదీక్ష

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్ఛమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

సెప్టెంబర్-2013 ✦ సంపుటి-10 ✦ సంచిక-5

Publisher&Editor : Ramu.P
Chief Artist : A.Dayakar
Associate Editor : P. Sudharani
Cartoon Editor : A.V.M
Well Wishers : Tanikella Bharani
Jaydev
Mallik
Sanku
Full Pillar : Bnim
Designing : Creative Graphix
Creative Team : Tumbali Sivaji
T.Chandra Sekhar
Rampa
Surya Dubey
P.V.Narayana
Ramsheshu
P.Priyatham
Mallikarjun.U

Address : HASYANANDAM,
#8-215/4,
Near Ramalayam,
Po:YERRABALEM
Pin 522 503,
Mangalagiri Mandal,
Guntur dist.
Ph : **9849630637**

email: **hasyanandam @yahoo.com**

Hyderabad, Cyberabad & Telangana Distributors:

Charminar News Agency,
1-6-176/1, M.G.Road,
Khandoji Bazar, **Secunderabad-3.**
Ph:9346515813
J.N.Road, Abids, **Hyderabad.**




స్వచ్ఛంగా నవ్వడమే అచ్చమైన అందం!
ఏ బ్యూటీపార్లర్లు ఇవ్వలేనిదీ చందం!!
నవ్యంగా నవ్వించే భవ్యమైన యజ్ఞానికి...
విఘ్నాలే తొలగాలని...
విజయాలే కలగాలని...
నవ్వుల నాయకుని మ్రోల...
విన్నవించుకుందాం....
హాస్యానందంగా ఉందాం!!!

నేస్తాలకు
వినాయక చవితి
శుభాకాంక్షలు!

-రాము.పి
(ఎడిటర్)

Smile in Every Page... Satisfaction in Every Smile

ఎక్కడ ఏ నవ్వులున్నాయో....









ముఖచిత్రం:
అనుష్క

వినాయకుడు
చిత్రకారుడు:
హరగోపాల్

మన జనాలు ..హరగోపాల్..



కార్టూన్లు

రీ సౌండ్...

సుదర్శనంగారి పేజీ హాస్యానందానికి 'కొసమెరుపు'. ఈ హాస్య నటులు చేయి తిరిగిన రచయిత కూడా అన్పిస్తుంది. ఒకటి రెండు లైన్లలో ఇస్తున్న ఆయన పంచ్ డైలాగులు వాహ్ అన్పిస్తున్నాయి. హరిగారి బొమ్మలతో పేజీ చూడ్డానికి చాలా బాగుంటుంది. ఈ సంచికలో వచ్చిన-'పెద్ద పెద్ద పాత్రలేమైనా పడ్డాయా?' అంటే... చుట్టా లొచ్చిన రోజు పడుతూనే ఉంటాయి. మిలమిలా తోమేస్తుంటా!' అంటూ ఆయనిచ్చిన సమాధానం సింప్లీ సూపర్బ్! ఇక ఈ సంచికలో ప్రచురించిన 'నాటి నవ్వులు' కథ – 'ఓ చతురా!' చాలా బాగుంది. మీ కృషికి అభినందనలు. **-ఆర్.విశాలక్ష్మి,కాకినాడ**

ఆగష్టు హాస్యానందంలో ప్రచురించిన మల్లిక్కామెడీ కథలు చాలా బాగుంది. ఇంకా ఈ సంచికలో ప్రచురించిన 8 కథలు; 52 కార్టూన్లు నవ్వులకు చిరునామా అయిందంటే నమ్మండి! మీ కృషికి అభినందనలు **-ఎమ్.మురళీకృష్ణ, తిరుపతి**

హాయ్...సానందంగా'లో చెప్పుకున్నట్లు నాకో ఫ్రెండ్ ఉండేవాడు. బాల్‌పెన్ క్యాప్ తీసి వ్రాసేవాడు. ఏంటి గురూ... అంటే 'బరువు' అనేవాడు. జానపద, పౌరాణిక కథల్లోని హాస్యాలకోసం ఓ పేజీ కేటాయిస్తే బాగుంటుందని నా సూచన. ఆ టాపిక్...ఈ కార్టూన్-జయదేవ్‌గారు చాలా బోల్డ్‌గా వ్రాస్తున్నారు. మిగతా ఇతర కార్టూనిస్ట్‌లకిది మంచి ప్రేరణగా ఉంటుంది. 'అక్కర్లేనంత కావలసిన వాళ్ళు' బాగుంది. ఏవీఎమ్ 'మనవాళ్ళు' బాగుంది. అన్ని కార్టూన్లు బాగున్నాయి. కార్టూనిస్ట్‌లందరికీ శుభాభివందనాలు. **-జి.ఎస్.రామారావు, హైదరాబాద్.**

హాస్యానందం పత్రిక కార్టూనిస్ట్‌లకు ఇస్తున్న ప్రోత్సాహం ఎంతలా ఉందంటే ఆగష్టు సంచికలో 52 కార్టూన్లు ప్రచురించారు. కలర్లో ప్రచురిస్తున్న లేపాక్షిగారి కార్టూన్లు ఇంకో హైలెట్. మధ్య మధ్యలో ఒకో గొప్పవారి ప్రత్యేక సంచిక... ధన్యవాదములు రాముగారు!
-పార్నంది వెంకటరామశర్మ, విశాఖపట్టణం

ఆగష్టు సంచిక బావుంది. కార్టూన్స్ బావున్నాయి. నేటి చదువులు బావుంది. కథల్లో మల్లిక్ 'అలవాటంటే అలవాటే' సూపర్. ఫన్ పంచ్ చాలా బావుంది. థాంక్స్ టు గంగాధర్.
-యామిని, గుంటూరు.

హాస్యచంద్ర సీరియల్ హాస్యానందానికి హైలెట్. పాత్రల చిత్రీకరణ, వారి సంభాషణలు, ఆర్టిస్ట్ గీసిన బొమ్మ మా నవ్వులకి ప్రాణం పోస్తుంది. ఇంతమంచి సీరియల్ అందించిన రచయితకి, హాస్యానందానికి మా ధన్యవాదాలు.**-కె.ప్రవీణ్‌కుమార్, ఖమ్మం**

ఆ టాపిక్! -ఈ కార్టూన్

Jayadev



కార్టూనిస్ట్ బుర్రలో చిత్ర విచిత్రమైన ఐడియాలు తడుతుంటాయి. కొన్నిటికి అర్థం పర్థం వుండదు, మరి కొన్నింటికి కథలూ, వ్యాఖ్యానాలూ రాయవచ్చు. అలాంటి విచిత్రమైన టాపిక్కుల్లో 'ఉరితాడు' ఒకటి! ఉరితాడు, ఉచ్చు, ఉరిశిక్ష, ఆత్మహత్యలాంటి సబ్జెక్టులతో, కార్టూనిస్ట్‌లు ఆటలాడుకున్నారు.

మనం ఎప్పటికీ మరిచిపోనిక కార్టూను, మన బాపుగారు గీశారు. ఉరితాడుని రాకెట్‌కి బిగించి, ఉరిపోసుకోబోయాడు భర్త. భార్య అతడి కాళ్ళు పట్టుకుని, తనకి, పిల్లలకి అన్యాయం చేయకండి అని విలపిస్తుంది! ఆ కార్టూన్ని అటుతిప్పి, ఇటుతిప్పి మన కార్టూనిస్టులు రకరకాలైన కార్టూన్లను సృష్టించారు.


వాటిల్లో ఒకటి, ఉరితాడుకి బెలూన్లు బిగించి వుంటాయి. మరొక ఉరితాడు బిగించిన చెట్టుకొమ్మ విరిగి కిందపడుతుంది. ఇంకో ఉరితాడు, ఫాన్ బ్లేడుకు బిగించి వుంటుంది. భార్య స్విచ్ మీద చెయ్యిపెట్టి, 'ఆన్' చెయ్యమంటారా అని అడుగుతుంది.

ఉచ్చు బిగించిన మెడ, ఆ మెడ పైన తల, ఆ తలలో మొహం, ఆ మొహంలో కళ్ళు, నోరు, ముక్కుల చిత్రీకరణ, ఉరితాడు కార్టూనుకి ప్రత్యేకతలని సంతరింపజేస్తుంది.


ఏ కార్టూనిస్టయినా ఒక సంకలనాన్ని వెలువరిస్తాడనుకుందాం. సబ్జెక్టుల లిస్టు తయారు చేసుకుంటాడు. వాటిల్లో ఒకటి ఉరితాడు!


ఉరితాడు సబ్జెక్టుమీద కార్టూను లేదనుకోండి. పాఠకుడికి అసంతృప్తి తప్పదు!!


చంద్రుడు నవ్వుతుంది
బొమ్మల్ని చూసి కాదు స్వామీ!!
హాస్యానందం
రాగతి పండరి


ఈ రోజు చంద్రుణ్ణి చూడ
కూడదని క్రిందకి దిగనంటే
ఎలారా నాయన.......
దిగండి.... దిగండి.....
ARUN
నేడే వినాయక చవితి

నవ్వుల పండగ


వెరైటీ కోసం....
ఈసారి గణేష్ విగ్రహం
ఇలా చేయించాను...!


అబ్బ... మట్టి గణపతి...,
భలే.. మాంచి సాంప్రదాయం,
నేనిక్కడే ఉండిపోతా..!



మల్లిక్ కామెడీ కథలు

లేడీ విలన్స్

ఉదయం....

రామారావుకి మెలుకువ వచ్చింది...

మెల్లగా కళ్లు తెరిచి గోడ గడియారం వంక చూశాడు.

టైము ఎనిమిది అయ్యింది.

రామారావ్ ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

అరె!... ఏంటబ్బ ఇంత ఒళ్లు తెలీకుండా నిద్రపోయాను? అనుకున్నాడు.

అమ్మో!... త్వరగా తెమలాలి... ఆఫీసుకి టైమైపోతుంది!!

రామారావ్ ఈ ప్రక్కకి తిరిగి చూశాడు.

మళ్లీ ఉలిక్కి పడ్డాడు.

కారణం అతని భార్య కమల అతనికంటే ఎక్కువగా ఒళ్లు మరిచి నిద్రపోతూ ఉంది.

"కమలా..." పిలిచాడు రామారావ్.

ఆమెలో చలనం లేదు.

"ఏయ్ కమలా..." ఈసారి కాస్త గట్టిగా పిలిచాడు.

ఉహూ!... అయినా కమలలో చలనం లేదు.

"కమ్‌మ్‌మ్‌లా....' ఆమె భుజం మీద తడ్తూ పిలిచాడు.

"రే.........య్" గట్టిగా అరుస్తూ.... రెండు పిడికిళ్లు బిగిస్తూ మంచం మీద లేచి కూర్చుంది కమల.

రామారావ్ బిత్తరపోయి కమల వంక చూశాడు.

ఆమె మొహంలో పట్టలేనంత కోపం.

"ఏ.... ఏ.... ఏమైంది కమలా?"

భయం భయంగా అడిగాడు రామారావ్.

కమల ఓసారి రెప్పలు టపటపా అల్లాడించి రామారావ్ వంక తేరిపార చూసి కిలకిలా నవ్వేసింది.

"ఏంటి?...... పీడకలేమైన వచ్చిందా?"

ఆమె నవ్వుని చూసి కాస్త తేరుకుంటూ అడిగాడు రామారావ్.

"అబ్బే... ఏం లేదు... ఏం లేదు.... మీరు మొహం కడుక్కుని న్యూస్ పేపర్ చదువుతూ ఉండండి.... నేను మీకు కాఫీ కలుపుకుని వస్తాను.." అంటూ బెడ్‌రూమ్‌లోంచి వెళ్లి పోయింది కమల.

✦✦✦

రామారావ్ హాల్లో సోఫాలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుతూ మధ్య మధ్యలో అసహనంగా వంటింటి గుమ్మంవైపు చూడసాగాడు.

కాఫీ తీసుకొస్తానని ఇందాకనగా చెప్పిన కమల ఇంకా రాదేంటబ్బా?!... వంట గదిలో ఇంతసేపు ఏంచేస్తుంది?...

న్యూస్ పేపర్ పక్కనపెట్టి రామారావ్ వంట గదివైపు అడుగులు వేశాడు.

వంటగది గుమ్మంలోంచి లోపలికి తొంగి చూసిన రామారావ్ కంటికి ఓ దృశ్యం కనిపించింది.

కమల కాఫీ కప్పులోకి చేతిలోని కాగితం లోంచి ఏదో పొడి వేస్తూంది.

"ఏంటిది? కాఫీలో ఏం కలుపుతున్నావ్?" అంటూ లోపలికి అడుగుపెడ్తూ కమలని అడిగాడు రామారావ్.

"విషం" అని తాపీగా చెప్పింది కమల.

ఆ సమాధానానికి రామారావ్ ఉలిక్కిపడి నేలమీద పడిపోయాడు.

"అయ్యయ్యో.... ఏంటి అలా పడి పోయారు?" కంగారుగా అడిగింది కమల.

"ఉలిక్కిపడి పడ్డాను"

"ఏంటో...ఈ మధ్య మీరు ఊర్కూర్కే ఉలిక్కి పడ్తున్నారు... అయినా ఎవరైన మామూలుగా ఉలిక్కిపడ్తారు... మీరేంటి నేలమీద దభేల్‌మని పడేంతగా ఉలిక్కిపడ్తున్నారు?.... ఊర్కే అతి కాకపోతే..." అంటూ రామారావ్ నెత్తిన జల్లకాయ్ కొట్టి జబ్బపట్టి నేలమీంచి లేవదీసింది కమల.

"మరి కాఫీలో విషం కలిపితే ఉలిక్కిపడరా? నేను కాబట్టి ఇలా ఉలిక్కిపడ్డాను... అదే వేరే ఎవరైన అయితే వెల్లకిలా... బొక్క బోర్లా... తలక్రిందులుగా ఇలా రకరకాలుగా ఉలిక్కి పడ్తారు తెల్సా?" బుర్రకాయ్ తడుముకుంటూ అన్నాడు రామారావ్.

"ఆ?!... నేను కాఫీలో విషం కలుపుతున్నానా?" అయోమయంగా చూస్తూ రామారావ్‌ని అడిగింది కమల.

"కాదా మరి?.... అదిగో వంటింటి గట్టు



మీద మిగిలిన పొడిపెట్టావ్ నువ్వేచూడు..."

"హయ్యో!.... సారీనండీ...."

"ఏంటి సారీ.... నేను సమయానికి వచ్చి చూడకపోతే నువ్వు దండేసిన నా ఫోటోకి సారీ చెప్పాల్సి ఉండేది చిరాకుగా అన్నాడు రామారావ్.

"సర్లెండి... ఇప్పుడే ఒక్క నిముషంలో మళ్లీ వేరే కాఫీ పెట్టి తెస్తా... మీరు వెళ్లి హాల్లో కూర్చుండి."

"వద్దులే... కాఫీ నేనే కలుపుకుంటాను" అంటూ స్టవ్ దగ్గరికి వెళ్లాడు రామారావ్.

✦✦✦

ఆఫీసుకెళ్లడానికి తయారైన రామారావ్ హాల్లో సోఫాలో వంగి కూర్చుని షూ లేసుల్ని కట్టుకోసాగాడు.

నేలమీద ఏదో నీడ కదలాడింది. అనుమానంగా తలెత్తి చూసిన రామారావ్ ఠారెత్తిపోయాడు.

కమల చేతిలో కత్తిపీట పట్టుకుని అపర కాళిలా రౌద్రంగా చూస్తూ సర్రున చెయ్యి పైకెత్తింది!

ఆమె చెయ్యి వేగంగా క్రిందికి దిగే టైములో రామారావ్ "కెవ్వ్వ్..."మని అరుస్తూ సోఫా లోంచి నేల మీదికి మూడు పల్టీలు కొట్టాడు. ఫ్రాక్షన్ ఆఫ్ సెకండ్‌లో కత్తిపీట వేటు నుండి తప్పించుకున్నాడు.

"కెవ్వున ఆ కేకలేంటీ... నేలమీద ఆ పల్టీలేంటీ? ఏం... ప్యాంటులో బొద్దింకేమైన దూరిందా?" పకపకా నవ్వుతూ అడిగింది కమల.


రామారావ్ నేల మీద నుంచి లేచి పళ్లు కొరుకుతూ కమల వంక చూశాడు.

"బొద్దింక ప్యాంటులో దూరిందా? ఏం?.... వేళాకోళంగా ఉందా?..." అన్నాడు ఆవేశంతో రొప్పుతూ.

కమల రామారావ్ వంక బిత్తరపోయి చూసింది.

"అదేంటదీ... ఉట్టి పుణ్యానికే అలా కోప్పడతారు?.... పోనీ బొద్దింక కాకపోతే ఎలక! ఆ విషయం చెప్పాలి గానీ... అలా కోప్పడితే ఎలా?" అంది బాధగా.

"బొద్దింకా కాదూ... ఎలక కాదు!... నన్ను



పిచ్చిమాటల్లో పెట్టి ఏమార్చకు... నువ్వు నన్ను చంపాలని చూస్తున్నావ్ కదూ?..." జుట్టు పీక్కుని అరుస్తూ అన్నాడు రామారావ్.

"అయ్యో రామా... నేను మిమ్మల్ని చంపడం ఏంటండీ పాడూ..." మంగళసూత్రం కళ్లకి అద్దుకుంటూ అంది కమల.

"మరి లేకపోతే చేతిలో ఆ కత్తిపీట ఏంటి?..."

"వంట గదిలో కూరలు తరుగుతూ మీరాఫీసుకి వెళ్తున్నారని బయటికి వచ్చాను!"

"అదే... కత్తిపీటతో సహా బయటికి రావల్సిన అవసరం ఏమిటి?' రెట్టించి అడిగాడు రామారావ్.

"అయ్యో రామా... మీకన్నీ లేనిపోని అనుమానాలే..."

"లేనిపోని అనుమానలేంటి... నువ్వు నా పీక తెగ్గొయ్యడానికి సర్రున కత్తిపీట ఎత్తి! అందుకే కదా నేను కెవ్వున అరిచి పల్టీలు కొట్టింది?..." చెప్పాడు రామారావ్.

"అవునా?..." అయోమయంగా చూస్తూ అమాయకంగా అంటూ తలని తొండలా పైకి క్రిందికీ ఆడించింది కమల.

రామారావ్ కమల వంక వెర్రి చూపులు చూశాడు.

◆◆◆

ఆరోజు ఆఫీసులో రామారావ్‌కి అస్సలు మనశ్శాంతిగా లేదు... పనిమీద అస్సలు కాన్‌సన్‌ట్రేషన్ చెయ్యలేక పోతున్నాడు....

వారం క్రితం నుండీ అతనికి కమలతో ప్రాబ్లెం స్టార్ట్ అయ్యింది.

ఒకరోజు కత్తిపీటతో నరికెయ్యబోయింది... ఒకరోజు పాలల్లో విషం కలపబోయింది.... ఒకరోజు రోకలితో తల బద్దలు కొట్ట బోయింది... ఒకరోజు కొడవలికి పదును పెడ్తూ తను చూసేసరికి చట్టుక్కున దాచేసింది.


ప్రతీసారీ ప్రమాదాన్ని వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు.

ఎందుకు చంపాలనుకుంటుంది?...

కమలకి ఓ బావ ఉన్నాడు... ఎప్పుడూ రామారావ్‌కి బావ కబుర్లే చెప్తూ ఉంటుంది.... వాడికింకా పెళ్లి కాలేదు... కొంపదీసి కమలకి బావంటే చాలా యిష్టమేమో... తనని చంపేసి వాడిని చేస్కుందామని అనుకుంటుందేమో!!..

రామారావ్ బాధగా తల విదిలించాడు.

"అలా బుర్రకాయ్‌ని సరా...సరా...సరా.. అంటూ అటూ ఇటూ ఊపడమేనా పని కూడా



ఏమైనా చేసేది ఉందా?..."

ఉలిక్కిపడి చూశాడు రామారావ్...

ఎదురుగా క్రూరంగా చూస్తూ బాస్.

"ఇందాకట్నుండీ నీ వ్యవహారాన్ని చూస్తున్నా!..." పళ్లు కొరుకుతూ అన్నాడు బాస్.

"సారీ సార్..." అంటూ రామారావ్ ఫైళ్లలో తలదూర్చాడు.

రోజూ బాస్‌తో ఇలానే చివాట్లుతింటున్నాడు. కమల గురించిన ఆలోచనలు అతన్ని వెర్రి వాడిని చేస్తున్నాయ్.

సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వెళ్లిన రామారావ్ ఇంటి గుమ్మంలోనే బిగుసుకు పోయాడు. లోపలి దృశ్యంతో అతని పై ప్రాణాలు పైనే పోయాయ్.

లోపల... హాలు మధ్య ఓ మంత్రగాడు పెద్ద బొట్టూ... పెద్ద జుట్టుతో హాం.. హ్రీం... క్రీమ్...అంటూ ఏవేవో మంత్రాలు చదువుతున్నాడు... అతని ముందు ముగ్గువేసి ఉంది.

ఆ ముగ్గులో సగానికి కోసిన నిమ్మ కాయలున్నాయ్. సీలింగ్‌ఫ్యాన్ నుండి ఓ బల్లిని తల క్రిందులుగా వ్రేళ్లాడదీసి ఉంది. మంత్రగాడి ఎదురుగా కమల నల్లచీర కట్టుకుని జుట్టువిరబోస్కుని పద్మాసనం వేస్కుని కూర్చుని ఉంది.

రామారావ్ కంగారుగా లోపలికి పరిగెత్తాడు.

"ఏయ్.... ఎవరు నువ్వు?" కంగారుగా అడిగాడు.

"కనిపించడం లేదూ?... మంత్రగాడిని!" చిరాగ్గా సమాధానం ఇచ్చాడు వాడు.


"ఏం చేస్తున్నావ్?"

"నా మంత్రశక్తితో సమాధిలో నిద్రిస్తున్న కాద్రాని లేపుతున్నా!"

"ఎందుకు?"

"లేచి గోళ్లతో నిన్ను చీల్చి నీ రక్తం తాగి... తర్వాత నిన్ను తినడానికి..."

"నా యింటికొచ్చి నా మీదే మంత్రశక్తిని ప్రయోగించడానికి ఎన్ని గుండెల్రా నీకూ...? వెంటనే బయటకి పదా!...' అంటూ కోపంతో చిందులెయ్యడం మొదలెట్టాడు రామారావ్.



"అబ్బ ఉండండీ!... నేనే అతన్ని పిలిపించాను." అంది కమల.

"ఎందుకూ?" చిరాకుగా చూస్తూ అడిగాడు రామారావ్.

"మిమ్మల్ని కాద్రాకి అప్పగించడానికీ... మీకు చేతబడి చెయ్యడానికీ..."

"అదే...ఎందుకనీ..." చిందులేస్తూ అడిగాడు రామారావ్.

"అవునబ్బా... ఎందుకనీ?" ఆలోచనగా మొహంపెట్టి అంది.

రామారావ్‌కి చిర్రెత్తుకొచ్చింది! మూలనున్న దుడ్డుకర్ర తీస్కుని మంత్రగాడిని తిడుతూ వీధి చివరికంటా తరుముకుంటూ వెళ్లాడు.

కమల మైండుకి ఏదో అయ్యిందనీ.... ఇక లాభం లేదనీ రామారావ్ కమలని ఒక సైక్రియాట్రిస్ట్ దగ్గరికి తీస్కెళ్లాడు. కమల వింత ప్రవర్తన గురించీ... తనని చంపాలని అనుకోవడం గురించీ చెప్పాడు.

సైక్రియాట్రిస్ట్ కమలతో లోపలిగదిలో గంటసేపు విడిగా మాట్లాడి తర్వాత నవ్వుతూ బయటికి వచ్చాడు.

"ప్రాబ్లెం సీరియస్సేగానీ... మీరేం వర్రీ కానవసరంలేదు!" అన్నాడు కులాసాగా.

"సీరియస్ అంటారు... మళ్లీ వర్రీ కావొద్దంటారేంటి డాక్టర్...అసలు తను అలా ఎందుకు ప్రవర్తిస్తుంది?" నెత్తికొట్టుకుంటూ ప్రశ్నించాడు రామారావ్.

"టీవీలో లేడీ విలన్స్ ఉండే సీరియల్స్ చూసి ఆమె బుర్రకాయ్ కాస్త ఎఫెక్ట్ ఇచ్చింది... సీరియల్స్‌లో అంతేకదా... ఆడాళ్లు మొగుడ్ని చంపేయాలనుకుంటారు.. లేదా అత్తగార్నో, ఆడపడుచునో లేపెయ్యాలని అనుకుంటారు. ఇలాంటి కథలు ఉన్న సీరియల్స్ చూసి ఆమె మెదడు కాస్త అటూ ఇటూ అయ్యింది"

"అయ్యో!... మరిప్పుడెలా డాక్టర్?" భయం భయంగా అడిగాడు రామారావ్.

"ఏముందీ?... ఆమెని ఆ దిక్కుమాలిన సీరియల్స్ చూడనివ్వకుండా చెయ్యడమే!!..."

రామారావ్ ఎగిరి గంతేసి ఇంటికి ఉన్న కేబుల్ టీవీ కనెక్షన్ పీకించేశాడు.

అప్పటినుండీ కమల బుర్రకాయ్ సరిగా పనిచేస్తూ మొగుడితో ప్రేమగా ఉంది.

ఓ సినీ ప్రేమికుడి ప్రేమకథ!

– యు. మల్లికార్జున



ప్రతిరోజు 'జెంటిల్ మాన్' లా డ్రెస్ వేసుకొని 'జులాయి'ల రోడ్డుమీద తిరిగే నాకు, 'అనుకోకుండా ఓ రోజు', 'బొమ్మరిల్లు'లో హాసినిలా ఓ 'దేవత' ఎదురైంది.

'ఆమె'ని చూసిన ఆ 'క్షణం' నా 'గుండెజారి గల్లంతయ్యింది'. ఆ రోజు నుండే 'అలా మొదలైంది' నా 'ప్రేమ' 'ప్రయాణం'. హిట్ సినిమా కోసం కష్టపడే దర్శకునిలా 'ఆమె' 'స్నేహంకోసం' ఆమె వెనుకే పడితే ఒక 'చిరునవ్వుతో' తన స్పందన తెలియజేసింది. నాకు ఆస్కార్ అవార్డ్ తీసుకున్నంత 'ఆనందం' వేసింది.

'ఈరోజుల్లో'లా 'సరదా సరదాగా' 'అమ్మాయితో' షికారుకెల్తే 'గబ్బర్‌సింగ్'లాంటి ఆమె 'అన్నయ్య' 'షాడో'లా మమ్మల్ని 'వేటాడివెంటాడి', 'క్షణం క్షణం' మమ్మల్ని అనుసరించాడు.

అది 'నేను' గమనించే లోపు, మరో నలుగురితో 'సుడిగాడు'ల ప్రత్యక్షమై 'దూకుడు'గా 'అతడు'చెలరేగి, నన్ను తుక్కు రేగొట్టాడు.

"వుంది నాకో బుల్లి చెల్లి, దానికి చేయాలి పెళ్లి, అడ్డురాకు నువ్వు మళ్లీ" అని సిన్సియర్‌గా, సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చి, వెళ్తూ ... వెళ్తూ ... 'ఐతే' అందరి అన్నయ్యల్లా కాకుండా 108కి ఫోన్ చేసి మరీ వెళ్లాడు.

'47 రోజులు' హాస్పటల్లో బెడ్ రెస్ట్ తీసుకొని, బయటపడి నా 'కథ' ని నా ఫ్రెండ్స్‌కి చెప్పి 'ప్రేమిస్తే' ఇలా జరిగింది అని వివరిస్తే ... వాళ్లు నమ్మకుండా వహ్వా ... అని నీ 'ప్రేమకథ' 'సూపర్' అని పొగిడి, నీలో ఓ మంచి రైటర్ దాగున్నాడని నన్ను 'ఆకాశమంత' ఎత్తేశారు.

కట్ చేస్తే ....

నేను ఎక్కడ పడ్డానా అని చూస్తే ... 'సినిమా అడ్డ, కృష్ణానగర్ గడ్డ' మీద వున్నాను.



కండ్లకుంట శరత్‌చంద్ర

హాస్యచంద్ర 001



సుబ్బారావు చిరునవ్వు నవ్వి, “మా కుక్కను ఎవరూ దొంగలించలేదు. అది యాక్షన్ హీరో టైపుది కాదు. సెంటిమెంటల్ టైపు.

“అంటే... గ్యాంగ్‌లీడర్ లో చిరంజీవిలా కాకుండా ‘రాజా’ సినిమాలో వెంకటేష్ టైపు మనస్తత్వం ఉన్నదన్నమాట.”

“అవును!”

“మీ కుక్క ఎలా ఉంటుంది?”

“తెల్ల బొచ్చుకుక్క. పేరు జిమ్మి”.

“గోత్రం?”

“తెలీదు”

“ఐదువేలివ్వండి. మీ కుక్క మీ ఇంట్లో ఉంటుంది”.

“ఫీజు ఎక్కువేమో?”

సుబ్బారావు చెక్ రాసి ఇచ్చాడు.

“నేనొకసారి మీ ఇల్లు చూడాలి. స్టడీ చెయ్యాలి” అన్నాడు హాస్యచంద్ర.

“సరే! ఎప్పుడొస్తారు?”

“ఇప్పుడే!”

హాస్యచంద్ర రెడీ అయ్యి వచ్చే లోపల, సుబ్బారావు ఇంకో రెండుసార్లు సరదాగా ఆ బెల్ నొక్కాడు.

✦✦✦

“చూడు బాబూ! ముందుగా మా ఇంట్లోని సీలింగ్ ఫాన్‌లకున్న దుమ్ము దులిపి శుభ్రంగా తుడిచి, ఆ తర్వాత ఇంట్లోని అన్ని గదులలో బూజు దులిపి, ఆ తర్వాత ఇల్లంతా చక్కగా ఊడ్చి, ఆ తర్వాత ఏం చేయాలో వచ్చి అడుగు” ప్రహేళికారావు నెమ్మదిగా చెప్పాడు.

‘ఛట్! ఇలాంటి దిక్కుమాలిన పనులు చేయాలా!? సమతతో నా పెళ్ళి కానీ... ఈ ముసలాడ్ని కల్లుతాగి, తోకలో ముల్లు గుచ్చుకుని కాలికి తేలుతో కాటు వేయించుకొని, తెలుగు టి.వి.లో లిప్ మూవ్‌మెంట్ కదలకుండా వచ్చే డబ్బింగ్ సీరియల్ చూసొచ్చిన పిచ్చికోతితో కరిపిస్తాను’ మనసులో అనుకున్నాడు డబ్బారెడ్డి.

“ఏమిటోయ్! ఇంకా ఇక్కడే నిలబడ్డావ్. ఫస్ట్‌బాల్‌కే బౌల్డ్ అయ్యి వెళ్ళిపోతావా!”

“హిహిహి...! హబ్బే ఏం లేదండీ ఫ్యాన్‌కున్న దుమ్ము బూజుకర్రతో దులపాలా, చీపురుతో దులపాలా అని ఆలోచిస్తున్నాను”.

“హమ్మా! అవేం కుదరవు. నీ చొక్కాతో దులుపు”.

‘అనవసరంగా కెలుక్కున్నాను బాబోయ్’ మనసులో అనుకుంటూ తన చొక్కా విప్పి కుర్చీ ఎక్కి సీలింగ్ ఫ్యాన్‌కున్న దుమ్ము దులపసాగాడు. అలా అన్ని గదులలోని ఫ్యాన్లన్నీ శుభ్రపరిచాక ప్రహేళికారావు చెప్పిన పనులన్నీ చేశాడు. ఆ తర్వాత నడ్డి పీకుతుంటే వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

“భలేవాడివోయ్! అలా కూర్చుంటే ఎలా! పద, అంట్లు నీకోసం గోతికాడ నక్కలాగ ఎదురుచూస్తున్నాయ్!” అంటూ డబ్బారెడ్డి చెయ్యి పట్టుకుని కుక్కను ఈడ్చుకెళ్ళినట్టు బరబరా ఈడ్చుకెళ్ళి వాష్ ఏరియాలో వదిలాడు.

డబ్బారెడ్డి అంట్లవంక చూశాడు.

మాడిపోయిన గిన్నెలు, తాగి పారేసిన గ్లాసులు, తిని పారేసిన ఎండిపోయిన కంచాలు, జిడ్డుపట్టుకుపోయిన చెంచాలు, పప్పు, పులుసు, అన్నం అంటుకొని ఉన్న గరిటెలు.... ‘మాకు త్వరగా స్నానం చేయించరా గాడిద’ అంటూ అతని వంక కోపంగా చూశాయి.

“ఊ...! ఉస్కో” అనేసి వెళ్ళిపోయాడు ప్రహేళికారావు.

జరిగిన కథ: హాస్యచంద్ర ఓ ప్రైవేట్ డిటెక్టివ్. ఒక పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో భార్య తప్పిపోతే కంగారు పడుతున్న ఒకతనికి మాస్టర్‌ప్లాన్ వేసి అతని భార్య అక్కడికి చేరుకునేట్లు చేస్తాడు హాస్యచంద్ర. ఈ సంఘటన చూసిన చాలామంది హాస్యచంద్ర ఫోన్ నెంబరు తీసుకుంటారు. ప్రహేళికారావు– తన కూతురు వెంట ప్రేమిస్తున్నామంటూ ఎవరైనా పడుతున్నారా కనిపెట్టమని హాస్యచంద్రకు ఫోన్ చేస్తాడు. ఆ కుర్రాల లిస్ట్ తీసుకొచ్చి ప్రహేళికారావుకిస్తాడు హాస్యచంద్ర.

–ఇక చదవండి

జీవితంలో ఎప్పుడూ చిన్న చెంచాన్నైనా తోమని డబ్బారెడ్డికి వాటిని ఎలా తోమాలో అర్థం కాలేదు. ఆ అయోమయంలోనే కింద కూర్చుని ఒక స్పూన్‌ను తోమేసిన లెక్కలో వేసేసి పక్కనున్న టబ్‌లో వేసాడు. అలాగే స్పూన్లూ, గరిటెలు, పళ్ళేలూ ట్యాప్ క్రింద పెట్టి టబ్‌లో వేయసాగాడు.

"ఏమేవ్ సురభి! ఓసారిలా రా! అంట్లు తోముటలో సరికొత్త టెక్నిక్ నేర్చుకుందువు గానీ..." అరిచాడు ప్రహేళికారావు.

దాంతో సురభి వచ్చి చూసి పగలబడి నవ్వ సాగింది.

"ఇలా అంట్లు తోమితే ఇహ నువ్వు పాసయి నట్లే" వెటకారంగా అంది సురభి.

"ఏదైనా ఓ గిన్నె తోమి, అంట్లు ఎలా తోమాలో చూపిస్తారా?!" దీనంగా అడిగాడు డబ్బారెడ్డి.

"హమ్మా! అదెలా కుదురుతుంది. పరీక్ష హాల్లో ఎవడైనా ఇన్విజిలేటర్‌ను, ఓ ప్రశ్నకు జవాబు రాసి చూపించండి సార్... అని అడుగుతాడా! ఇప్పుడు నువ్వు పరీక్ష రాస్తున్న విద్యార్థివి. మేము ఇన్విజిలేటర్లము. పైగా మార్కులు వేసేదీ మేమే" అన్నాడు ప్రహేళికా రావు.

డబ్బారెడ్డి ఒక నిమిషం పాటు దీర్ఘంగా ఆలోచించి, తన స్నేహితుడికి ఫోన్ చేశాడు.

"ఒరేయ్! అంట్లు ఎలా తోమాలిరా?" అడిగాడు.

"ఓరి డబ్బారెడ్డిగా ఎవరింట్లోనైనా పని మనిషిగా కుదిరావా?"

"ఏహే! అవన్నీ నీకెందుకు... నోర్మూసుకుని చెప్పరా అంట్లెలా తోమాలో?"

"వెరీ సింపుల్! ఇప్పుడక్కడ ట్యాప్ ఉందా?"

"ఆ ఉంది!"


"కడగవలసిన పాత్రను చేతిలోనికి తీస్కో ట్యాప్ ఆన్ చేసి దానికింద పెట్టు పాత్ర సైజును బట్టి ఒక నిమిషం నుండి ఐదు నిమిషాల వరకు పెట్టొచ్చు. అంతే!!"

"నా కొడకా.... మరో మాట మాట్లాడితే ట్యాంక్‌బండ్ నీళ్ళు తాగిస్తా. మొదట లూజ్ మోషన్స్. ఆ తర్వాత నరకానికి ప్రమోషన్!"

"సరే! మా పనిమనిషిని అడుగు" అంటూ డబ్బారెడ్డి ఫ్రెండు ఫోన్ తీసుకెళ్ళి తమ పని మనిషికిచ్చాడు.

"ఓలు బాబూ!... డబ్బారెడ్డి బాబా!"





"అవును రత్తాలూ! అంట్లు ఎలా తోమాలో కాస్త చెప్తావా?"

"అంట్లు తోమడం బెమ్మవిద్యేంకాదు బాబూ షానావీజీ. ముందు చీర చెంగును బొడ్లో దోపుకోవాలి...."

'దీనికోసం నేను చీరెక్కడ కట్టుకోను' మనసులో అనుకున్నాడు డబ్బారెడ్డి.

"దోపుకున్నారుగా బాబూ! ఇప్పుడు కింద కూకోవాలి. కూకున్నారుగా బాబూ! తోమాల్సిన గిన్నెను చేతిలోకి తీస్కుని కొన్ని నీళ్ళు చల్లేసి, ఒకచేతిలో ఎట్టుకోవాలి. ఎట్టుకున్నారుగా బాబూ! ఇంకో చేత్తో కొబ్బరిపీసు కానీ, ప్లాస్టిక్ పీసు కానీ, ఇనుప పీసు కానీ తీస్కోవాలి బాబూ... తీస్కున్నారుగా బాబూ...! దాన్ని అంట్లు తోమే సబ్బుమీద గానీ, పొడిమీద గానీ అద్దాలి బాబూ.... అద్దేశారుగా బాబూ! ఆ పీసుకు రెండు సుక్కల నీళ్ళు తాకించి గిన్నెలో ఎట్టి బరబరా తోమేయాలి బాబూ! తోమేశారుగా బాబూ....! వుప్పుడు నీళ్ళతో కడిగేయాలి బాబూ...అంతే బాబూ! ఎంతబలంగా తోమితే అంత బాగా మెరిసిపోతాయ్ బాబూ !" అంట్లు తోమే విధానాన్ని యూనివర్శిటీ ప్రొఫెసర్ కన్నా బాగా వివరించింది రత్తాలు.

ఆ స్ఫూర్తితో డబ్బారెడ్డి అంట్లమీద ఆబగా పడి వాటిని ఒక ఏకు ఏకి పారేశాడు.

ప్రతీ ఇంటికీ ఓ శనిగాడున్నట్లే ప్రతి అంట్ల గ్రూపులోనూ ఎంతకూ శుభ్రంకాని ఓ మాడిపోయిన పాత్ర ఉండే తీరుతుంది. అలా మాడిపోయిన ఓ పాలగిన్నె తాలూకు మసి ఎన్ని రౌండ్లు తోమినా బాగుపడడం లేదు. అటూ, ఇటూ చూసి తననెవ్వరూ గమనించడంలేదని నిర్ధారించుకుని , ఆ గిన్నెను టబ్‌లో అట్టడుగు భాగాన ఉంచి, దానిపై శుభ్రపరచిన మిగతా పాత్రలన్నీ పెట్టి, టబ్ తీసుకొచ్చి కిచెన్‌లో పెట్టాడు.

ఆ తర్వాత హాల్లోకి వచ్చి కూర్చున్నాడు.

"ఏమోయ్ ...! అప్పుడే కూర్చుంటున్నావే. మరో పదిమార్కుల ప్రశ్నకు జవాబు రాయాలి. పదపద" అంటూ రెక్క పుచ్చుకుని లాక్కెళ్ళి ఓ బట్టల మూటను చూపించాడు.

"ఇవి అమ్మి స్టీలు సామాన్లు తీసుకు రావాలండి?!" అడిగాడు డబ్బారెడ్డి.

"నీ మొహం! వీటిని ప్రక్షాళన చేయాలి".

"అంటే అడుక్కుతినే వాళ్ళకు దానం చేయాలా అండి!"

"అండీ లేదు గుండీ లేదు వీటిని తీసుకెళ్ళి శుభ్రంగా ఉతికి ఆరేయ్! సర్ఫ్ ప్యాకెట్ ఆ గూట్లో ఉంది తీస్కో. ఏ ఒక్క బట్టనైనా సరిగ్గా ఉతక్కపోతే పదికి పది మార్కులూ పోతాయ్. జాగ్రత్త!" చెప్పాడు ప్రహేళికారావు.

డబ్బారెడ్డి, సప్తగిరి ఛానెల్‌లో 'పందుల పెంట-వాటి ఉపయోగాలు" అనే కార్యక్రమపు వ్యాఖ్యాతలా ఏడ్వలేక నవ్వలేక బట్టలమూట తీస్కున్నాడు.

✦✦✦


స్కూటర్ అపార్ట్‌మెంట్ ముందు ఆగింది. హాస్యచంద్ర, సుబ్బారావు- సుబ్బారావు ఫ్లాట్‌లోనికి నడిచారు.

"లంచ్ టైమైంది. భోజనం చేసి వెళ్ళండి" అంది సుబ్బారావు భార్య హాస్యచంద్రతో.

'అందుకేగా... ఈ టైంలో వచ్చింది' అని మనసులో అనుకుని "తప్పకుండా!" అన్నాడు.

భోజనానికి రమ్మని పిలుపొచ్చేదాకా భూతద్దంతో... కుక్క తినే బిస్కెట్లను, దాని భోజన పాత్రను పరిశీలించాడు.

అందరూ భోజనానికి కూర్చున్నారు.



"ఇది భీష్మేబిత్ర చిద్ర ...మొన్న పి.టి.వి.లో మీ ఇంటి పెంట ... సారీ మీ ఇంటివంటలో ఓ బీష్మీ భామ తయారు చేసి చూపించింది స్పెషల్ వంటకం. తినండి" అని వడ్డించింది.

ఆ పదార్థం నల్లగా లుకలుకలాడుతుంది.

ఒక్క ముద్ద తినగానే... హాస్యచంద్ర సింక్ దగ్గరికి పరిగెత్తి డోక్కున్నాడు.

వెంటనే చెక్‌తీసి, సుబ్బారావు ప్రక్కన ఉంచి, "అయ్యా! సుబ్బారావు గారూ.... మీ కుక్క తప్పిపోలేదు. పారిపోయింది. మీఆవిడగారి స్పెషల్ వంటకాలు తింటూ... భరించలేక ... ఈ తంటాలు నాకెందుకురా బాబోయ్... అని పారిపోయింది. ఇప్పుడూ నేను కష్టపడి, దాన్ని వెతికి తెచ్చినా... అది పారిపోతుంది. కుద రకపోతే... తన గొలుసును తానే గొంతుకు బిగించుకుని ఆత్మహత్య చేసుకుంటుంది... ఇది వంటా!... ఛీ! ఛీ!! పెంటకు పర్యాయ పదంలా ఉంది. కడుపులో మంట !! మీరంటే ఈవిడగారి మొగుడు... ఏం వండిపెట్టినా తినాల్సిన బాధ్యత మీ మీదుంది. ఆ అల్పజీవి కుక్కకేం ఖర్మండీ?! అలా సిటీ దాటి వెళ్ళితే ఏ అశుద్ధమో తిని .... జీవితాంతం హాయిగా బ్రతుకుతుంది. అంతేగాని ఈ నికృష్టపు తిండి దానికెందుకండీ!" అనేసి హాస్యచంద్ర బయ టకి నడిచాడు.

✦✦✦

డబ్బారెడ్డి కిందామీదా పడి, మాసిపోయిన బట్టలను బండబాదుడు బాది.... ఆరేయ సాగాడు.

"ఏమోయ్! ఇది కూడా మల్లెపువ్వుల్లా ఉతికి ఆరేయ్!" అంటూ ప్రహేళికారావు తన ఒంటి మీదున్న బనీనును, టవల్ చుట్టుకుని తన అండర్‌వేర్‌ను డబ్బారెడ్డి మొహం మీద వేసి రెండోసారి స్నానం చేయడానికి బాత్రూంలోకి వెళ్ళిపోయాడు.

"ఛీ... ఛీ... నా మొహం మున్సిపాలిటీ చెత్తకుండీలో పడిపోనూ." అనుకుంటూ చిటి కెన వేలు గోరుతో వాటిని పైకి లేపి ట్యాప్ కింద వేసి ట్యాప్ ఆన్ చేసి కసికొద్దీ వాటిని కాళ్ళతో కసాబిసా తొక్కాడు.

పది నిమిషాలలో ప్రహేళికారావు బయట కొట్టి "భోజనం చేయడానికి ముందు దీర్ఘ శంకకు వెళ్ళి, స్నానం చేసి రావడం రిటైర య్యాక అలవాటయింది. అదిగో ఆ మూలన బరన్ బ్రష్, ఆసిడ్, హార్పిక్ ఉన్నాయి. మా ఇంట్లో ఉన్న రెండు పాయఖానాలతో కుదుకు న్నున్న బాత్రూంలను తెల్లగా మల్లెపూవులా... హాఁ... హాఁ... హాఁ... తెల్లని ఇడ్లీలలా శుభ్ర పరచు. ఎంత శుభ్రముగా ఉంటే అన్ని మార్కు లు వస్తాయి చెప్పి బెడ్రూంలోకి వెళ్ళిపోయాడు.

'ఒరేయ్ ప్రహేళికారావు నాచేత నీ ఇంటి లెట్రిన్లు కడిగిస్తావా! నీ కూతురితో నా పెళ్ళి అవనివ్వరా నీ చేత పబ్లిక్ టాయిలెట్లు ఇడ్లీల లాగా తెల్లగా కడిగిస్తా' మనసులో అనుకుని, శుభ్రపరచడానికి కావల్సిన వస్తువులన్నీ తీసు కొని బాత్రూంలోకి వెళ్ళాడు.

ఎడమ చేత్తో ముక్కు మూసుకుని, కుడిచేత్తో ఆసిడ్ చల్లి బాటిల్ అక్కడ పెట్టి ఈసారి కుడి చేత్తో ముక్కు మూసుకుని ఎడమచేత్తో బరన్ బ్రష్ అందుకుని కళ్ళు సగం మూసుకుని మొహం ఆముదం తాగిన పిల్లాడిలా పెట్టి శుభ్రం చేయసాగాడు.

"ఏమండీ! డబ్బారెడ్డిని చూస్తుంటే అలెంబ్లీ రౌడి సినిమాలో పాకీజాకు తమ్ముడిలా అన్పిస్తు న్నాడు కదండీ!" అంది సురభి. (సశేషం)







కథ

వినాయకుడి భూలోకయాత్ర

పసుపులేటి సుధారాణి
9542646931

“అమ్మా! నన్ను ఆశీర్వదింపుము.”

తన జన్మదిన సందర్భంగా సర్వాలంకార భూషితుడై తలవంచుకుని అతివినయంగా తన ఎదురుగా నిలబడి వున్న తన ప్రియ పుత్రుణ్ణి మురిపెంగా చూస్తూ–

“మనోభీష్టసిద్ధిరస్తు” అంటూ దీవించింది పార్వతీదేవి.

“ధన్యుడిని మాతా!” శిరస్సు వంచి వినయంగా పలికాడు బుజ్జి వినాయకుడు.

కొద్దిసేపు వినాయకుడిని తన ఒడిలో కూర్చోబెట్టుకుని ముద్దులాడిన తర్వాత–

“కుమారా! ఇంక వెళ్ళి నీ తమ్ముడితో కలిసి ఆడుకొనుము” అని చెప్పింది.

“నాయనా! ఏమిటి ఇంకా ఇక్కడే నిలుచుని వున్నావు? తినుటకు ఏమైనా కావలెనా?...” తటపటాయిస్తూ అక్కడే నిలబడిన వినాయకుడిని అనుమానంగా చూస్తూ అడిగింది పార్వతీదేవి.

“తినుటకు కాదు మాతా!... ఈరోజు వినాయక చవితి పర్వదిన సందర్భాన భూలోకం వెళ్ళవలెనని నాకు మిక్కిలి మక్కువగా నున్నది. భూలోకవాసులు వినాయక చవితిని బహు వైభవంగా చేసెదరట. మా జన్మదినమును భూలోకవాసుల మధ్య జరుపుకొనవలెనని సరదాగా వున్నది. ఆజ్ఞ యివ్వండి మాతా!” వినయాతి వినయంగా అడిగాడు వినాయకుడు.

వినాయకుడి కోరికను వింటూనే అదిరి పడింది జగజ్జనని.

“వద్దు నాయనా వద్దు! పధ్నాలుగు లోకాలలో ఏ లోకానికైనా వెళ్ళు కానీ, భూలోకం మాత్రం వద్దు” కంగారుపడిపోతూ చెప్పింది.



తల్లి కంగారును చూసి విస్మయుడౌతూ, “ఎందుకమ్మా అంత కంగారు?... భూలోకం చాలా అందమైన ప్రదేశం. మానవులు మంచి హృదయం కలవారు. అంత మంచివారి మధ్య ఈరోజంతా సంచరిస్తూ వారు నాకు సమర్పించెడి నైవేద్యములను ఆరగిస్తూ ఈరోజంతా ఆనందముగా గడిపివేసి రాత్రి సమయమునకు కైలాసము చేరుకొనెదను” తల్లికి ధైర్యం చెప్పు తున్నట్లుగా అనునయంగా చెప్పాడు వినాయకుడు.

“నా మాట విను తండ్రీ! భూలోకవాసులు నువ్వు అనుకొన్నంత మంచివారు కాదు. స్వార్థపరులు, మోసకారులు. లాభం వుందనుకుంటేనే ఎదుటివానికి సహాయపడతారు. దేవుడి పేరుమీద చందాలు వసూలు చేసి దేవుడికి ఒక్క రూపాయి ఖర్చుపెడితే, తొంభై రూపాయలు తమ స్వలాభానికి వాడు కుంటారు. వారి దృష్టిలో బొమ్మరూపంలో వున్నవారే దేవుళ్ళు. నిజరూపంతో వారికి మనం దర్శనమిచ్చినా వేషాలు వేశాను కుంటారే గానీ మనల్ని గుర్తించరు. భూలోకం వెళ్ళినచో నువ్వు ఇడుముల పాలగుదువు” నచ్చచెప్పటానికి ప్రయత్నించింది పార్వతీదేవి.

తల్లి మాటలను విని ముఖం మాడ్చుకున్నాడు బుజ్జి వినాయకుడు.

దభీమని నేలమీద చతికిలబడి– “నన్ను ‘మనోభీష్టసిద్ధిరస్తు’ అని దీవించావు కదమ్మా! దీవించిన నువ్వే నా మనోభీష్టానికి అడ్డు చెబుతున్నావు. నీకిది న్యాయమా?” బేలగా ప్రశ్నించాడు.

ఖంగుతింది పార్వతీదేవి. తన ఆశీర్వాదం వృథా కారాదని ఆలోచించింది. చివరికి వినాయకుడిని నేలమీదనుంచి లేవనెత్తి ఆప్యాయంగా తల నిమురుతూ– “కుమారా! నీ యిష్టప్రకారమే భూలోకం వెళ్ళిరమ్ము. కానీ...” అర్థోక్తిలో ఆగిపోయింది.

“చెప్పు మాతా!” అప్పటి వరకూ కలుగులో నుండి వీరి సంభాషణంతా వింటున్న అనిరుద్ధుడు చటుక్కున కలుగులోంచి బయటకు వచ్చాడు.

అనిరుద్ధుడిని చూడగానే పార్వతీదేవికి అసలు విషయం అర్థమైపోయింది.

'ఇదంతా నీ నిర్వాకమా అనింద్యా!' మనసు లోనే అనుకుని పైకి చిరునవ్వుతో,

"మీరు భూలోకంలో అడుగుపెట్టిన క్షణం నుండి రాత్రి ఏడుగంటల వరకు మీ మీ దైవ శక్తులను ఉపయోగించరాదు. అందుకిష్ట మయినచో భూలోకయాత్రకు శీఘ్రమే వెళ్ళ వచ్చును" ఓరగా చూస్తూ అతిగంభీరంగా చెప్పింది పార్వతీదేవి.

'ఓస్, ఇంతేనా! భూలోకంలో దైవశక్తుల నుపయోగించవలసిన అవసరమేముంది...' అనుకొని తల్లికి మాట యిచ్చి అనింద్యుడి వీపుమీద కూర్చుని రివ్వున భూలోకం వైపుగా వెళ్ళిపోతున్న వినాయకుడిని చూసి నర్మ గర్భంగా నవ్వుకుంది పార్వతీదేవి.

✦✦✦

భూలోకంలో దిగుతూనే సందు సందుకి వేసి వున్న పందిళ్ళు, ఆ పందిళ్ళలో నిలబెట్టిన తన నిలువెత్తు విగ్రహాలను, విగ్రహం ఎడమ చేతిలో వుంచిన గుమ్మడికాయంత లడ్డూ, కింద చుట్టూ పేర్చి వున్న నైవేద్యాలను చూసి ఉప్పొంగిపోయాడు విఘ్న నాయకుడు.

'ఈ మానవులకు నేనంటే ఎంత భక్తి' అనుకున్నాడు ఆనందంగా ఆనందస్వరూపుడు.

"ఏయ్! డబ్బు యివ్వు" చేతిలోని రేకు డబ్బాను మోగిస్తూ అడిగిన వ్యక్తిని అయోమయంగా చూశాడు వినాయకుడు.

"ఏంటలా చూస్తున్నావ్! వినాయకుడికి నవ రాత్రులు చేస్తున్నాము. డబ్బులివ్వు" కరుకుగా అడిగాడా వ్యక్తి.

తనకు నవరాత్రులు చేస్తున్నారనే మాటకు ఆనందించినా, డబ్బు అంటే ఏమిటో తెలియక తికమకపడిపోయాడు వినాయకుడు.

"ఏంటీ అలా చూస్తున్నావ్? డబ్బుల్లేవా? ఏ నాటక సమాజంనుండి వస్తున్నావ్? ఈ నగలన్నీ గిల్టువా?... బంగారమా?" అంటూ వినాయకుడి మీదకు ఒంగి నగలను పట్టుకుని చూసిన ఆ పెద్దమనిషి కళ్ళు మెరిశాయి.

"సరే ఏదో ఒకటిలే కానీ, ఈ నగలన్నీ యిచ్చావంటే నీ పేరు చెప్పి ఆ పందిరిలో వున్న అసలు వినాయకుడికి ధరింపచేసి, నవరాత్రులు అయిపోగానే నీకు తిరిగి యిచ్చేస్తాను. సరేనా!" అన్నాడు భక్తిగా కనులు అర మోడ్చుతూ.

విగ్రహానికి ధరింపచేస్తాను అన్నమాట వినగానే ఉబ్బితబ్బిబ్బైపోయి తన వంటిమీద వున్న నగలన్నీ చకచకా తీసి ఆ వ్యక్తిచేతిలో పెట్టాడు వినాయకుడు, అనింద్యుడిని కూడా తీసి యివ్వమని చెపుతూ.

ఇద్దరి నగలూ తీసుకొని ఎంచక్కా ఈల పాట పాడుకుంటూ వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

✦✦✦

"అనింద్యా! చాలా ఆకలిగా నున్నది. ఏ పందిరిలోకి వెళ్లినా లడ్లు, కుడుములు, ఉండ్రాళ్ళు కాదు కదా, కొంచెము వడపప్పు కూడా పెట్టుటలేదు. 'వేషాలు బాగున్నాయి కానీ పూజ అయిన తర్వాత రండి' అంటూ వెళ్ళగొట్టుచున్నారు. మిట్ట మధ్యాహ్నమైపోతోంది. ఇప్పటి వరకు పూజ మొదలే పెట్టలేదు. ఇంక ఎప్పటికి పూర్తవుతుంది, ఎప్పుడు మనకి నైవేద్యములు పెడతారు? నీరసంతో శోష వచ్చుచున్నది అనింద్యా!' చేటలంత చెవుల్ని టపటపలాడించబోయి ఓపిక లేక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు వినాయకుడు.

తన స్వామివారి దీనాలాపనలను విన్న అనింద్యుడికి కడుపు తరుక్కుపోయింది.

"స్వామీ! మీరలా ఆ ప్రక్కగా కాసేపు



కూర్చోండి. ఇప్పుడే వచ్చేదను" అంటూ తుర్రుమని వెళ్ళిపోయాడు. గంట తర్వాత తాగుబోతులా తూలుకుంటూ వచ్చి "స్వామీ! నన్ను రక్షించండి" అంటూ కన్నీరు పెడుతూ దీనంగా వినాయకుడి కాళ్ళదగ్గర ఒరిగిపోయాడు.

అనింద్యుడి పరిస్థితి గమనించిన వినాయకుడు కంగారుపడి పోయాడు. ఏం జరిగిందో తెలియక ఆదుర్దాపడుతూ చివరకు 'బహుశా యింతసేపు గాలించినా ఆహారమేదీ దొరికి వుండదు. ఆకలితో కళ్ళు తిరిగివుంటాయి. అసలే చిన్నజీవి' అనుకుని గబగబా వెళ్ళి ఆ ప్రక్కనే వున్న నీళ్ళ తొట్టిలోంచి నీళ్ళను తొండంతో పీల్చి, తీసుకొచ్చి అనింద్యుడికి త్రాగించాడు. కాసేపటికి తేరుకున్నాడు అనింద్యుడు.



"ఆహారమేదీ దొరకలేదా అనింద్యా! ఆకలికి అసలు తట్టుకోలేవు కదా!" తల నిమురుతూ ఆప్యాయంగా అన్నాడు.

"మీకు ఆహారం తీసుకొద్దామనే వెళ్ళాను స్వామీ! చిన్నప్రాణిని కదా, నన్నెవరు చూస్తారులే అనుకున్నాను. కానీ మానవులు మహా తెలివైనవారు. మీ విగ్రహాల దగ్గర పెట్టిన నైవేద్యాల దగ్గర ఏవో బిస్కట్టు ముక్కలు కూడా వున్నాయి. నా సహజబుద్ధి చేత ఒక బిస్కట్టుని ఆత్రంగా కొరికి ముక్కను మింగాను. దాని రుచికి నాకేదో అనుమానం వచ్చి వెంటనే అక్కడినుండి మీ వద్దకు పరిగెత్తుకొచ్చాను. లేకపోతే నేను ఈ పాటికి యమపురి వెళ్ళిపోయేవాడిని ప్రభూ!..." ఘొల్లుమన్నాడు అనింద్యుడు.

"ఇంతకీ ఆ బిస్కట్టు ఏమిటి అనింద్యా?" భయంగా అడిగాడు వినాయకుడు.

"అది భూలోకంలో వున్న మా వారసులను నాశనం చేయుటకు మానవుడు తయారు చేసిన విషాహారం స్వామీ!" నీరసంగా జవాబిచ్చాడు అనింద్యుడు.

"అమ్మో! మనమిక ఒక్కక్షణమైనా యిక్కడ వుండొద్దు. పద, మరో వీధిలోకి పోదాం..." అంటూ హడావిడిగా తన వీపుపైకి ఎక్కబోతున్న వినాయకుడిని వారిస్తూ "ప్రభూ! నేను ఇప్పుడే కదా ప్రాణాపాయం నుండి బయట పడితిని. మిమ్మల్ని మోయలేను. ఇద్దరమూ మెల్లగా నడుచుకుంటూ వెళదాము, పదండి" అంటూ బలహీనంగా అడుగులు వేస్తున్న అనింద్యుడిని చూసి ఉస్సురని నిట్టూరుస్తూ ఆకలికడుపుతో అనుసరించాడు వినాయకుడు.

✦✦✦

"అనింద్యా! నేను యింక ఒక్క అడుగు కూడా కదపలేను. ఆకలితో శోష వచ్చుచున్నది. ఎక్కడకు వెళ్ళినా ఆహారము అడిగినా డబ్బు అడుగు చున్నారు. పందిళ్ళలో నైవేద్యము తినవలెనన్న కదు భయంగా వున్నది. మన ఆభరణాలన్నీ తీసుకొన్న వ్యక్తి నామమాత్రం కనిపించుట లేదు. ఇప్పుడేమి చేయుటం!..." అడిగాడు వినాయకుడు అనింద్యుడిని.


"ఏమి చేయుదము ప్రభూ!" ఆకలి వల్ల, ఆ బిస్కట్టు తినడం వల్ల వచ్చిన నీరసం చేత దుఃఖంతో గొంతు పూడుకుపోయింది అనింద్యుడికి.

వీరి వాలకాన్ని గమనిస్తూన్న ఒక వ్యక్తి వాళ్ళ దగ్గరకు వచ్చి "మీకు ఆకలిగా వుందా?" ఆదరంగా అడిగాడు.

అవునన్నట్లుగా తలలూపారు ఇద్దరూ సమాధానం కూడా చెప్పే శక్తి లేక.

"నేను ఒక పని చెప్తాను. చేస్తే మీ ఇద్దరికీ భోజనానికి సరిపడా డబ్బిస్తాను" చెప్పాడతను.

'డబ్బు' అన్నమాట వినగానే ప్రాణం లేచి



వచ్చింది యిద్దరికీ. వెంటనే వొప్పేసుకున్నారు.

ఆ వ్యక్తి వారిని ఆ ప్రక్కనే వున్న ఒక బట్టల దుకాణం వద్దకు తీసుకువెళ్ళి యిద్దరినీ ఎంట్రన్స్‌కు చెరొక వైపూ నిలబెట్టి –

“ఇక్కడ సాయంత్రం ఆరున్నర వరకూ నిలబడి వుంటే మీకు డబ్బిస్తాను. ఒక్క క్షణంకూడా కూర్చోకూడదు సుమా!” అంటూ తాను లోపలికి వెళ్ళి క్యాష్ కౌంటర్‌లో దర్జాగా కూర్చున్నాడు.

షాపుకి వచ్చేపోయే వాళ్ళందరూ ‘హాయ్, అచ్చం వినాయకుడిలా, మూషికంలాగా వున్నారు కదూ!’ అంటూ పెద్దలు, ‘అబ్బ! తొండం భలే వుంది’... ‘ఎలుక ఎంత బావుందో!’ అంటూ పిల్లలు వినాయకుడి తొండాన్ని, అనింద్యుడి తోకను పట్టుకు లాగుతూ కేరింతలు కొడుతుంటే మొదట్లో సరదాగా అనిపించినా సమయం గడిచేకొద్దీ దుఃఖం ముంచుకురాసాగింది ఇద్దరికీ.

ఆరున్నర ఎప్పుడవుతుందా అని క్షణమొక యుగంలా గడుపుతూ ఎదురు చూడసాగారు.

“ఇదిగోనయ్యా... మీకిస్తానన్న డబ్బు. తీసుకోండి” అంటూ చెరొక యాభై రూపాయలు ఇద్దరి చేతుల్లో పెట్టి, వారిద్దరినీ తన షాపు ముందు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలబెట్టడం వలన వచ్చిన రెట్టింపు లాభాలని తల్చుకుంటూ ఆనందపడిపోయాడు షాపు యజమాని.

“ప్రభూ! ఆహారము తినుటకు వెళదామా?” నీరసంగా అడిగాడు అనింద్యుడు.

“నాకు అడుగు వేసే శక్తి నశించినది అనింద్యా! నీవు మోయగలిగితే తీసుకువెళ్ళు. లేదా నేను ఇక్కడే...” మాట పెగల్లేదు వినాయకుడికి.

“అంతమాట అనకండి ప్రభూ! మాత మన శక్తుల్ని ఉపయోగించకూడదని ఆంక్ష పెట్టుట వలన మనకిన్ని కష్టాలు సంప్రాప్తించినవి. కొద్దిగా ఓర్చుకొనుము” అంటూ వినాయకుడిని అతికష్టంమీద తన వీపుపై ఎక్కించుకొని భారంగా ముందుకు సాగింది.

✦✦✦

“ధాం... ధాం... ధాం...”

చెవులు చిల్లులు పడేలా వినిపించిన శబ్దానికి దడుచుకున్న అనింద్యుడు ఒక్కసారిగా ముందుకు ఒక్కగెంతు గెంతి పరుగు లంకించుకోవడంతో దభీమని బోర్లాపడి నేలను కరుచుకున్నాడు వినాయకుడు. అతికష్టంమీద లేచి కూర్చుని చేతులతో మొహాన్ని తడిమి చూసుకున్నాడు.

‘ఈ అనింద్యుడు పక్కి పిరికివాడు. మానవులు మోగించు డప్పు శబ్దాలకే వళ్ళు మరిచి అంత పరుగు పెట్టాలా? దంతము వూడినదో, విరిగినదో తెలియుట లేదు. అసలే ఇప్పటికే తనని ఏకదంతుడు అని పిలుస్తున్నారు... ఇప్పుడు దంతహీను డనిపించుకోవాలో ఏమో! ఖర్మ. నడుము కూడా బెణికినట్లున్నది. అమ్మ చెప్పినట్టు భూలోకవాసులు మాయగాళ్ళు, స్వార్ధపరులు. ఒకడు నగలెత్తుకుపోయాడు... మరొకడు మిట్టమధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఎండలో నిలబెట్టాడు... భూలోకంలో ఏదో బావుకు తిందామని వచ్చాడు తాను. సాక్షాత్తూ తానే దిగివచ్చినా పట్టించుకోకపోగా, తనను నానా యిక్కట్ల పాలు చేసి తన పోలికలతో చేసిన విగ్రహాలకు మాత్రం నైవేద్యాలు నిండుగా పెట్టి తామే సుష్టుగా ఆరగించి తనను పస్తు వుంచారు. పెద్దలమాట వినని తమకు బుద్ధి చెప్పుటకే మాత దైవశక్తులను పయోగించకూడదు అని ఆంక్ష పెట్టినది. తమకు బాగా బుద్ధి వచ్చినది. ఇంకెప్పుడూ భూలోకంలో అడుగు పెట్టడం కాదుకదా, ఓరకంటితో కూడా చూడను. నా నిజభక్తుల కోరికలు అక్కడినుండే తీరుస్తాను.’

వినాయకుడు యిలా తలపోస్తుండగానే సాయంత్రం ఏడుగంటలు కావడంతో తమ తమ దైవశక్తులను యధావిధిగా పొంది అనింద్యుడి నెక్కి రివ్వున వెనక్కి తిరిగి చూడకుండా కైలాసం వెళ్ళిపోయాడు పాపం! బొజ్జ నిండని బుజ్జి వినాయకుడు.







వెంటాడే పెళ్ళి కూతురు

కథ

వేగి నూకరాజు
7702141014

విశాఖపట్నము రైల్వేస్టేషను వచ్చే పోయే జనాలతో క్రిక్కిరిసి ఉంది.

“టీ...టీ... కాఫీ... కాఫీ ... హాస్యం నిండే హాస్యానందం పత్రిక కొనండి చదవండి. కడుపుబ్బ నవ్వండి” అంటూ ఆ ప్లాట్‌ఫారమ్‌పై వినబడసాగాయి.

ఇంతలో జగదీష్ 3వ నెంబరు ప్లాట్‌ఫారమ్ నుండి ఒకటవ నెంబరు ప్లాట్ ఫారమ్ మెట్లు ఎక్కి పరిగెడుతున్నాడు తన డ్యూటీకి టైమయ్యింది అనే ఆదుర్దాతో.

జగదీష్ వెనకాలే పెళ్ళి కూతురు వేషములో యున్న ఓ అమ్మాయి ఉన్న పళంగా జగదీష్ వెంబడి పరిగెడుతూ “ఏమండీ... ఏమండీ!...” అంటూ అరుస్తూ వెళ్తుంది.

ముందు జగదీష్, వెనుక ఆ అమ్మాయి పరిగెడుతున్నారు.

చూసే వాళ్లకు ఆ అబ్బాయి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకొని వదిలేసి పారిపోతున్నాడని అనుకుంటున్నారు. ముందు జగదీష్ ... వెనుక పెళ్ళి కూతురు ఆ అమ్మాయి.

జగదీష్ ఒకటవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌లో యున్న తన ఆఫీసులోనికి వెళ్ళి లోపల డ్యూటీ బట్టలు మార్చుకుంటున్నాడు.

ఇంతలో బయటనుండి “ఏమండీ!... ఏమండీ!! అంటూ ఆ పెళ్ళికూతురు అమ్మాయి ఆ ఆఫీసులోయున్న సెక్షను ఆఫీసరును పిలిచింది.

“ఎవరు కావాలి?” అని ఆ సెక్షను ఆఫీసరు అడిగాడు ఆ అమ్మాయిని.

అప్పుడు ఆ అమ్మాయి “ఇప్పుడే ఒక ఆయన ఈ రూమ్ లోకి వచ్చాడు... ఆయన... ఆయన ...” అంటూ నసిగింది.

విషయం మరోలా అర్థం చేసుకున్న ఆ సెక్షను ఆఫీసరు అప్పుడే లోనికి వెళ్ళిన జగదీష్ ను భార్య కాబోలు అనుకొని–

“జగదీష్ ! జగదీష్... మీ ఆవిడ వచ్చింది. ఎందుకు వచ్చింది కనుక్కో” అంటూ లోని కెళ్ళిన జగదీష్‌ను కేకలేశాడు.


బట్టలు మార్చుకుంటున్న జగదీష్ –

“వస్తున్నానుండండి” అంటూ షర్టు గుండీలు పెట్టుకుంటూ వచ్చాడు.

అప్పుడు ఆ సెక్షను ఆఫీసరు జగదీష్ వైపు చూసి “చూడు జగదీషు, ఎవరో ఈ అమ్మాయి మీ ఆవిడంట... ఇందాకటి నుండి నీ గురించి అడుగుతూ ఉంది. వెళ్ళి చూడు” అంటూ పెళ్ళి కూతురిలా ముస్తాబయిన ఆ అమ్మాయిని చూపించాడు.

ఒక్కసారి ఆ అమ్మాయిని చూసి గతుక్కుమని “ఎవరు నువ్వు? నీకు ఏం కావాలి?” అంటూ అడిగాడు జగదీష్

ఆ అమ్మాయి బిక్కమొహం తో “ఏమండీ! ఏమండీ!... మీది ... మీది... ” అంటూ నసుగుతూ అంది.



అప్పుడు జగదీష్ ఆ సెక్షను ఆఫీసరుతో–

"సార్ ఈ అమ్మాయి ఎవరో నాకు తెలియదు" అన్నాడు.

"ఏంవోయ్ జగదీష్! ఆ అమ్మాయి నీకోసం ఉరుకులు, పరుగులు తీసుకొని వచ్చినట్టుంది. నీవేంటి? ఆ అమ్మాయిని తెలియదంటున్నావు. ఆ అమ్మాయి ఏమో నిన్ను స్వంత మొగుడిలా ఏమండీ, ఏమండీ అని పిలుస్తుంది. ఏమిటి సంగతి. నిజం చెప్పు" అని క్యూరియాసిటీగా అన్నాడు ఆ సెక్షను ఆఫీసరు.

నిజం సార్! ఆ అమ్మాయెవరో నాకు తెలియదు. నమ్మండి సార్" అంటూ తల పట్టుకున్నాడు జగదీషు.

ఇంత జరుగుతున్నా ఆ అమ్మాయి అక్కడ్నించి కదలలేదు.

మరల ఏమండీ? ఏమండీ? అంటూంది కాని అసలు విషయం ఆ అమ్మాయి నోటంట రాలేదు.

అప్పుడు జగదీష్ ఆ అమ్మాయి వైపు చూసి కోపముగా– "ఏంటి? ఎవరు నువ్వు నాటకాలాడుతున్నావా? ఎందుకొచ్చావు?" అని అడిగాడు కోపముగా.

"అది కాదండీ ... అది కాదండీ" అంటూ ఆ అమ్మాయి ఇంకా ఏదో చెప్పబోతోంది.

అంతలో జగదీష్ "చస్! నోర్మూయ్! ఎవరే నువ్వు? నేను నీ మొగుడ్నా? నీవు నా పెళ్ళానివా? నువ్వు నన్ను పెళ్ళి ఎప్పుడు చేసుకున్నావు? పద పోలీస్‌స్టేషనుకు..." అని కోపముగా అన్నాడు.



ఇదంతా చూస్తున్న ఆ ఆఫీసరు జగదీషును ఉద్దేశించి "చూడు జగదీసూ, ఆ అమ్మాయి నీవెవరో తెలియకపోతే నీ వెంబడే ఎందుకు వస్తుంది? నీవు ఏదో దాస్తున్నావు? నిజం చెప్పు?" అన్నాడు.

"లేదు సార్! నిజం సార్ నాకీ అమ్మాయి ఎవరో నాకు తెలియదు.... నిజం నమ్మండి సార్. నాకు భార్యా ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.... నా భార్య ఉంటుండగా ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాల్సిన పని నాకేంటి?" అన్నాడు దీనంగా సెక్షను ఆఫీసరుతో.

ఇంతలో ఆ అమ్మాయి "సార్" అంటూ గట్టిగా అరిచింది. ఆ అరుపుకు జగదీషు సెక్షను ఆఫీసరు ఉలిక్కిపడి "ఏమిటీ" అని ఆ అమ్మాయి వైపు చూశారు.

"చూడండి సారూ! నేను మీరనుకున్నట్లు ఆయన్ను చేసుకోబోయే పెళ్ళి కూతుర్ని కాదు. పొట్టకూటి కోసం ట్రైనులో అడుక్కునేటందుకు వేసుకొన్న పెళ్ళి కూతురి వేషం. అంతే గాని నేను అతని కాబోయే పెళ్ళాన్ని కాను. ట్రైనులో ఆయన వెనకే నేను ఈ స్టేషనులో దిగాను. ఈ సారు తొందర్లో అతని వాచీ పడిపోయింది. ఆ వాచీ అతనికి ఇచ్చేద్దామని ఉద్దేశ్యముతో ఆయన వెనకాలే నేను పరిగెడుతూ వచ్చాను. ఆ సారు నా మాట వినిపించుకోకుండా పరిగెడుతూ ఇక్కడికి వచ్చేసారు..." అంది గుండెల మీద భారం దించుకున్నట్లు.

అప్పుడు జగదీష్ ఆ సెక్షను ఆఫీసరు బిక్క మొహాలు వేసుకొన్నారు. జగదీష్ తన చేతి వైపు చూసుకున్నాడు. చేతికి వాచీ లేదు.

"సారీ అమ్మాయి. నన్ను క్షమించు నిన్ను తప్పుగా అర్థము చేసుకొన్నాము." అంటూ ఆ అమ్మాయి దగ్గర వున్న వాచీ తీసుకొని జేబులో నుంచి ఒక పది రూపాయల నోటు ఇచ్చాడు జగదీష్. ఆ అమ్మాయి వెళ్ళిపోయిన తర్వాత జగదీష్ ఆ సెక్షను ఆఫీసరు పగలబడి నవ్వుకున్నారు.





కథ

తెలివిగల మేక మెదడు

కోనె నాగ వెంకట ఆంజనేయులు
9290660220

చింటూగాడికి చిన్నప్పటి నుంచీ తెలివి తేటలు అంతంత మాత్రమే. వాడా వయసులో అనేక తెలివితక్కువ పనులు చేసి అందరితో తిట్లూ, తన్నులూ తినడం హాబీగా చేసుకున్నాడు.

ఓసారి వాళ్ళమ్మ డబ్బులిచ్చి బజారుకి పంపించి కారం బూందీ పట్టుకురారా అని చెబితే వాడు కారం పొట్లంతో తిరిగివచ్చి "ఇదిగోమ్మా కారం... బ్రాందీ చిన్నవాళ్ళకి ఇవ్వరంటా..." అంటూ మిగిలిన డబ్బులు వాళ్ళమ్మ ఒళ్ళో విసిరేసి ఆడుకోవడానికి పారిపోయాడు.

మరోసారి బీరకాయలు కొనుక్కు రారా అని పంపిస్తే ఖాళీ చేతుల్తో తిరిగివచ్చి మీరు ఊహించినట్లుగానే "బీరుకాయలు కూడా చిన్నపిల్లల కివ్వరంటమ్మా. చెబితే వినవేమిటీ నువ్వు?" అని విసుక్కున్నాడు.

ఇంకో విశేషం ప్రత్యేకంగా చెప్పాలి చింటూగాడి గురించి.

వాడికి పదేళ్ళ వయస్సున్నప్పుడు రెండో క్లాసు చదువుతున్నప్పుడు (పదేళ్ళకి రెండో క్లాసేనా అని కదా మీ సందేహం? అదే కదా నేను చెప్పింది. వాడు తెలివితక్కువవాడు కావడంతో పదేళ్ళొచ్చినా రెండోక్లాసు దాటలేదు వాడు మరి) వాడిక్లాసులో ఓ రెండుజెళ్ళ సీత వుండేది ముచ్చటగా. ఆ అమ్మాయంటే వీడికి మా చెడ్డ లైకింగు. ఆ అమ్మాయి కోసం యింటి నుంచి రోజూ కొబ్బరుండలో, బెల్లం ముక్కో జంతికలో లాగూ జేబులో పోసుకుని తెచ్చి ఇస్తుండేవాడు.

ఆ సీతా వాళ్ళు కూడా చింటూగాడు వాళ్ళున్న వీధిలోనే వుంటుండేవారు. చింటూగాడికి సీతంటే యిష్టమని తెలిసిన సీతా వాళ్ళింట్లో వాళ్ళు "మా సీతని పెళ్ళి చేసుకుంటావేమిట్రా?" అంటూ సరదాగా ఆటపట్టిస్తుండే వాళ్ళు.

పాపం మన తెలివి తక్కువ చింటూగాడు అది నిజమని నమ్మేశాడు.

గబగబా యింటికొచ్చేసి వాళ్ళమ్మని పక్కకి పిల్చి, "అమ్మా! నీ మెడలోని మంగళసూత్రం ఒకసారి యివ్వవే" అని అడిగేశాడు.

వాళ్ళమ్మ ఆశ్చర్యపోయినా వాడి తెలివి తక్కువతనం తెలిసిందే కాబట్టి కోప్పడకుండా "ఎందుకురా?" అని అడిగింది.

"మరేమోనమ్మా! సీతా వాళ్ళమ్మగారు నన్ను సీతని పెళ్ళి చేసుకోమన్నారు. మరి పెళ్ళంటే మంగళసూత్రం కావాలి కదా! దాని మెడలో కట్టొద్దా మరి!" అనేసరికి వాళ్ళమ్మ వాడి వీపుని విమానం మోత మోగించింది. అయితే ఆ తరువాత ఈ విషయం వీధి వీధందరికీ చుట్టు పక్కాలకీ, బంధుమిత్ర సపరివార సమేతులందరికీ విరగబడి నవ్వుతూ చెప్పి చాలాకాలం వాళ్ళందరినీ వినోదపరిచింది.

చింటూగాడి నాన్న సూర్యం మాత్రం "నా తదనంతరం ఈ తెలివితక్కువ వాడు ఎలా బ్రతుకుతాడో ఏంటోనని తెగ బెంగపడి పోతుండేవాడు.

కొడుకుని దగ్గర కూర్చోబెట్టుకుని తెలివి తేటలు గురించి అనర్గళంగా పాఠాలు చెప్తుండే వాడు. అయినా ఫలితం శూన్యం!

తెలిసిన వాళ్ళందరినీ తెలివి తేటలు రావాలంటే ఏం చెయ్యాలో చెప్ప మంటూ తెగ సతాయిస్తూ సలహాలడిగేవాడు. వాళ్ళందరూ ఎవరికి తోచిన సలహాలు వాళ్ళిస్తుంటే కొడుకుతో వాటిని తు.చ. తప్పకుండా ఆచరింపచేస్తుండేవాడు సూర్యం. కాని వాడి తెలివి తేటల్లో యిసుమంతైనా మార్పు రాలేదు ఎన్నాళ్ళైనా...ఎన్నేళ్ళైనా.

"రోజూ అల్లం కషాయం త్రాగించండి. పైత్యం కరిగిపోయి తెలివితేటలు పరుగు పరుగున వచ్చేస్తాయని ఎవరో సలహా యిస్తే వారం రోజులపాటు ఆ కషాయం తనే స్వయంగా తయారు చేసి పట్టేడు కొడుక్కి సూర్యం.


ధారాళమైన విరేచనాలు పట్టుకున్నాయి



గానీ చింటూగాడికే మాత్రం తెలివితేటలబ్బలేదు.

"రోజు పచ్చి కాకరకాయలు పరగడుపునే నమిలించండి. ఫలితముంటుంద"ని వేరెవరో సలహా యిస్తే అదీ చేశాడు. ఫలితం డిటో. అనగా విరోచనాలే విరోచనాలు. పాపం విరోచనాలతో నీరసించిపోయిన కొడుకుని చూసి చలించిపోయిన చింటూగాడి తల్లి "యింకెలాంటి చిట్కాలు కూడా నా కొడుకు మీద ప్రయోగించినా మర్యాద దక్కదని" మొగుడుకి వార్నింగిచ్చింది.

అయినా సూర్యం, భార్యకి తెలియకుండా రకరకాల చిట్కావైద్యాలు వాడిమీద ప్రయోగించి విఫలమైపోయాడు. ఓసారి ఊళ్ళోకి ఓ బైరాగి వస్తే పరుగున వెళ్ళి కొడుకు పరిస్థితిని వివరించాడు సూర్యం.



ఆ బైరాగి అంతా విని "నాయనా! మేక మెదడు మనిషి మెదడుతో సరిసమానమైనది. ఓ తెలివైన మేకమెదడు కూర వండించి నీ కుమారుడితో తినిపించితివా, వాడి తెలివితేటల ముందు నీ తెలివితేటలు దిగదుడుపే అవుతాయ"ని నిక్కచ్చిగా చెప్పాడు.

"ఆ మేక తెలివైనదీ కానిదీ ఎలా తెలుస్తుంది స్వామీ?" అని అడిగాడు సూర్యం.

"ఆ విషయం తెలుసుకోవడం నీ తెలివితేటలమీద ఆధారపడి వుంటుంది నాయనా" అని తెలివిగా జవాబు చెప్పి ధారాళమైన ఫీజు దండుకున్నాడు బైరాగి.

ఆ మరునాడు సూర్యం మార్కెట్‌కి వెళ్ళి తెలివిగల మేక మెదడు గురించి ఆరా తీశాడు.

"మా దగ్గరున్నవన్నీ తెలివైన మేకలేనని, తెలివితక్కువది ఒకటీ లేద"ని తేల్చి చెప్పాడు మటన్‌కొట్టు మస్తాన్.

సూర్యం ఓ మేక మెదడు కొనుక్కు వచ్చి భార్యకిస్తే ఆవిడ మసాలా దట్టించి కమ్మగా కూర వండి కొడుక్కి అన్నంతోపాటు పెట్టింది.

చింటూ కూరతో మొదటి ముద్ద నోట్లో పెట్టుకోబోతూ ప్రక్కనే వున్న తండ్రిని "నాన్నా! ఇది తెలివిగల మేక మెదడే కదా?" అని అడిగాడు.

"అవున్రా తండ్రీ. యిది తెలివి గల మేక మెదడే. ఆ మేక ఎంత తెలివి గలదంటే ఈ రోజు తనని చంపి అమ్మబోతున్నారన్న విషయం దానికి నిన్ననే తెలిసి... కట్లు తెంపుకుని పారిపోయి ఇప్పటి వరకూ తిరిగి రాలేదట" చెప్పాడు సూర్యం తడబాటు లేకుండా.

"అయితే ఆ మేక తెలివిగలదే. ఇది తెలివి గల మేక మెదడే" అని తృప్తిగా ఆ మేకమెదడు కూరంతా తృప్తిగా ఆరగించేడు చింటూ అన్నంతో పాటు.

✦ ✦ ✦

హమ్మయ్య! కథ అయిపోయిందని ముగింపు చుక్కలు పెట్టేసిన తరువాత తట్టింది మరో పొడిగింపు ముగింపు. చదవండి మరి!

ఆ మరునాడు ఉదయం నిద్రలేస్తూనే చింటూగాడు తండ్రి మంచం దగ్గరకు పరుగు పరుగున వెళ్ళి నిద్రలేపి –

"నాన్నా! నాన్నా! మరి ఆ మేక తనని చంపబోతున్నట్లు ముందుగానే గ్రహించి, కట్లు తెంపుకుని పారిపోయి యిప్పటివరకూ తిరిగి రాలేదని చెప్పావు కదా! మరి నేను దాని మెదడు తినడం ఎలా సాధ్యపడిందో అర్థం కావడంలేదు" అన్నాడు.

ఆ మాట వింటూనే సూర్యం సంబరపడిపోయాడు.

"ఎంత తెలివిగల ప్రశ్న వేశావురా నా తండ్రీ! నీకు తెలివితేటలొచ్చేశాయిరోయ్. ఆ బైరాగి చెప్పిన చిట్కా ఎంత బాగా పని చేసిందిరోయ్. తెలివిగల మేకమెదడు నీకు తెలివితేటలిచ్చేసిందిరోయ్!" అంటూ ఎగిరి గంతులేస్తూనే వున్నాడా రోజంతా సూర్యం.

ఇప్పుడు అసలైన ముగింపు చుక్కలు.



ఏవిఎమ్

మనవాళ్ళు


ఆదివారం సూర్యుడికి,
రాహు కేతువులకు పూజ,
జపం, దానం చెయ్యి!!
1
సోమవారం చంద్రునికి,..
మంగళవారం కుజునికి...
2
బుధవారం బుధునికి...
గురువారం గురువుకు...
3
శుక్రవారం శుక్రునికి
పూజ, జపం, దానాలు
చెయ్యి!!..
4
దాంతో నా పాపాలన్నీ
పోయినట్లేగా!!
అప్పుడేనా!!.. మళ్ళీ
ఓ ఏడాది డబ్బు...
సంపాదించుకుని..రా!!
ఏమేం చెయ్యాలో..
అప్పుడు
చెబుతా...!
5
AVM

గంగాధర్ వడ్లమన్నాటి



ఫన్ పంచ్!

మొగుడ్స్... పెళ్ళామ్స్... మధ్యలో నవ్వుల్స్!

ఎండాకాలం అని చల్లదనం కోసం సుబ్బారావ్ రాత్రి డాబాపై పడుకున్నాడు.

పొద్దునే భార్య వచ్చి నిద్రలేపడంతో ఇద్దరూ మెట్లు దిగుతుండగా సుబ్బారావ్ కాలు జారిపడి, కాలు విరిగి హాస్పిటల్‌లో జాయిన్ అయ్యాడు.

దాంతో అతని భార్య లక్ష్మమ్మ పొద్దున నుండీ ఆయనతోనూ వుంటూ జ్యూస్ తాగించి... టిఫిన్ తినిపించి... టాబ్లెట్స్ మింగించి... టానిక్ పట్టించి వచ్చిపోయే ప్రతి డాక్టర్‌నీ, నర్సునీ ఎంతకాలం పడుతుంది మా ఆయన కోలుకోవడానికి అని అమాయకంగా అడిగింది.

"ఆరేడు నెలలు పట్టొచ్చమ్మా" చెప్పాడు డాక్టర్.

"అలాగా!" అని కళ్ళొత్తుకుంది లక్ష్మమ్మ.

ఆమెనీ, ఆమె ప్రేమా, ఆత్రం, అంతర్మధనం చూసిన సుబ్బారావుగారు లక్ష్మమ్మని దగ్గరికి పిలిచి, "లక్ష్మీ! ఇప్పుడు ఇలా నిన్ను చూస్తుంటే నీ కాళ్ళు బిస్లరీ నీళ్ళతో కడిగి ఆ నీళ్ళు నెత్తిన జల్లుకోవాలనిపిస్తుందే. లేకపోతే ఇంతగా ప్రేమించే నిన్ను, ఏదో మోజులో పడి మోసం చేయాలనుకున్నందుకు నాకు తగిన శాస్తే జరిగింది. మెట్లపైనుండి పడ్డాను" చెప్పారు సుబ్బారావుగారు కూసింత భారమైన స్వరంతో.

ఆ మాటలకామె "మీరు నన్ను మోసం!..." అని మరేదో చెప్పేంతలో అతనే అడ్డుపడి–

"నన్ను పూర్తిగా చెప్పనీ లక్ష్మీ! నీకు కోపం వచ్చినా, నా రెండో కాలుకూడా విరిచేసినా లేక నన్ను పాతరేసినా ఆ నిజం నీకిప్పుడు చెప్పే తీరతాను. లేకపోతే నాకు మనశ్శాంతి లేదు. అసలు మన ఇంట్లో కూలర్ వున్నా... రోజూ నేను డాబాపైనే పడుకోవడానికి కారణం సహజమైన గాలికోసం మాత్రమే కాదు. పక్కింటి పార్వతి కూడా రోజూ మన డాబాకి ఆనుకుని వున్న వాళ్ళ డాబాపై ఒక్కతే పడుకుంటోంది. పైగా నావైపు రెండుమూడు సార్లు చూసి చిలిపిగా నవ్వింది కూడా. దాంతో రోజాలాంటి ఆమెపై మోజుతో బూజు ఆలోచనతో రోజూ మేడపైన పడుకునే వంకతో ఆమెకు దగ్గరవడానికి ప్రయత్నిస్తూ సరసాలకి అలవాటు పడ్డాను. అందుకేనేమో ఇలా..." చెప్పాడాయన దిగాలుగా కాలివంక చూసుకుంటూ.

ఆ మాటలకి ఆమె కళ్ళొత్తుకుంటూ –

"నన్ను క్షమించండి. ఆ విషయం నాకు తెల్సు" చెప్పిందామె.


"తెల్సా? తెల్సే వూరుకున్నావా? ఎంత గొప్ప మనసు లక్ష్మీ నీది."

"అదికాదండీ...ఈ విషయం నాకు నిన్న రాత్రే తెల్సింది. మీరు దుప్పటి మర్చిపోతే ఇద్దామని డాబాపైకి వస్తే, మీరు పక్క డాబా పైకి బంతిలా గెంతి వెళ్ళడం చూసి మిగతాది ఊహించాను" చెప్పిందామె.

"ఔనా! తెల్సికూడా అలా ఎలా వుండగలిగావ్? నువ్వు గొప్ప భార్యవి" చెప్పాడు సుబ్బారావ్‌గారు ఆమెవంక మరింత ప్రేమగా చూస్తూ.

"అలా పొగడకండి. ఏదోలా వుంది... పొద్దున మిమ్మల్ని నిద్రలేపి, మీతోపాటు మెట్లు దిగుతుండగా, రాత్రి మీరు ఆ పక్క డాబా పైకి ఆ పార్వతి కోసం వెళ్ళడం గుర్తొచ్చి నేనే కోపంతో మీ కాళ్ళకి నా కాలు అడ్డుపెట్టి మిమ్మల్ని పడిపోయేలా చేశాను" చెప్పిందామె చిరు వణుకు స్వరంతో నేలచూపులు చూస్తూ.












సెంటర్ అట్రాక్షన్








మాటల గారడీ...

- 'రా యిలాగా' అంటే... 'రాయిలాగా' నిలబడిపోతావేం?
- 'ఏకాకి' లా కూర్చున్న నిన్ను 'ఏ కాకి' పొడిచిందిరా?
- 'రాము' యిలా మా 'రాము' చేస్తే ఇక మీ యింటికి 'రాము'

–కోనే నాగ వెంకట ఆంజనేయులు









ఎ.జి. జయలక్ష్మీరాజు

పెళ్ళిఫోటో

సీరియల్

"చూశావా! మన ఊరి ప్రఖ్యాతి ఎలా దిగంతాలకు వ్యాపించిందో... నువ్వు మొద్దువెధవ్వి. దూరపుకొండలు నునుపు అన్న చందాన మనం టౌను చేరుకుందాం అంటూ నస పెడతావు. భోంచెయ్యండి. నేనలా రచ్చబండదాకా వెళ్ళొస్తాను" అంటూ శాలువాను సర్దుకుంటూ వెళ్ళిపోయాడు దుశ్యంతరావు.

"రచ్చబండ అంటున్నారు. ఏదైనా తగవులు తీర్చి తీర్పుల్లాంటివి ఇవ్వడం చేస్తుంటారా మీ నాన్నగారు" అడిగింది శ్రీవల్లి సాకేత్‌ను.

ఈ ఇంట్లో సాకేత్ మాత్రమే కుండబద్దలు కొట్టినట్లు నిజాలు చెబుతున్నాడని గ్రహించింది శ్రీవల్లి.

"అత్తయ్యా! మీరు ఎక్కడికో వెళ్ళిపోయినట్టున్నారు. పెదరాయుడి టైపులో తీర్పులిచ్చేస్తున్నట్టు ఊహించేసుకున్నారా? అంత లేదు. ఇలాంటి పల్లెటూళ్ళకు రచ్చబండలే న్యూస్ పేపర్లు, ఆల్ ఇండియా రేడియోలు, అసెంబ్లీలు, చివరికి సుప్రీం కోర్టు కూడాను. అన్ని వార్తలూ రచ్చబండ చేరింతర్వాత మళ్ళీ ఊళ్ళో కొస్తాయి" అన్నాడు సాకేత్.

ఆ రాత్రి అందరూ నిద్రపోయాక ఏదో గునపం పెట్టి తవ్వుతున్నట్టు శబ్దం వినిపించి శ్రీవల్లి మేలుకుంది.

మెల్లిగా లేచి కిటికీలోంచి చూసింది శబ్దం వస్తున్నవైపు.

కిటికీ పెరటివేపు దుశ్యంతరావు గునపంతో గొయ్యి తీస్తున్నాడు.

శ్రీవల్లి గుండెలు గుభేలుమన్నాయి.

వళ్ళంతా చెమటలు పట్టింది. సుబ్బారావును లేపుదామనుకుంటే అతను సాకేత్ గదిలో పడుకున్నాడు. తన ప్రక్కన పడుకున్న లయను లేపుదామనుకుంది.

వాళ్ళనాన్న చేసే అఘాయిత్యాలు తెలుసుండక పోవచ్చు. ఉన్నట్టుండి గొయ్యి ఎందుకు తవ్వుతున్నట్టు. ఊళ్ళోవాళ్ళు తిక్కలోడంటున్నారు. ఎవర్నయినా రాళ్ళతో కొట్టి చంపి పాతెయ్యటం లేదు కదా! ఆ ఆలోచన రాగానే కాళ్ళలో వణుకు పుట్టింది. ధైర్యం కూడదీసుకుని అటువేపే చూస్తోంది.

తళ తళ మెరిసే రాగిరేకులు కొన్ని గొయ్యిలో వేసి మళ్ళీ యధాతథంగా మట్టి కప్పెట్టాడు.

అంతవరకు చీకట్లో ఎక్కడుందో శకుంతలమ్మ దుశ్యంతరావు దగ్గరకు వచ్చి–

"అయిపోయిందా! రండి చేతులు కడుక్కోండి" అంటూ నీళ్ళు అందించింది.

దుశ్యంతరావు కాళ్ళు చేతులు కడుక్కుని కప్పెట్టిన గొయ్యివేపు ఓసారి చూసి పెట్రో మాక్సు లైటు తీసుకుని భార్యతో సహా ఇంటో కెళ్ళాడు.

శ్రీవల్లికి తల బాదుకున్నా దుశ్యంతరావు గొయ్యిలో కప్పెట్టిన రాగిరేకులేమిటో అర్థం కాలేదు.

రాత్రంతా నిద్రపోలేదు. తెలతెలవారుతుండగా నిద్రపట్టింది.

బాగా పొద్దెక్కిందనుకుంటూ నిద్ర లేచేసరికి తొమ్మిదయింది.

అయ్యో! ఇంత లేటుగా లేచాను ఏమనుకుంటారో ఏమిటో అనుకుంటూ లేచింది.

పిల్లలిద్దరూ ఎటో వెళ్ళారు. శకుంతల వంట పనుల్లో మునిగిపోయింది.

శ్రీవల్లి ఇల్లంతా కలియ తిరుగుతూ ఓ గది



జరిగిన కథ: పావని తండ్రి సుబ్బారావు ఒక నవల రాసి కూతురికి ఇస్తాడు. ఆ నవల కథాంశం తన ప్రేమకథేనని చెప్తాడు. అది పావని చదవడం మొదలెడుతుంది. సుబ్బారావు పెళ్ళి చూపులో ఓ ఫొటో చూసిన శ్రీవల్లి ఎవరికీ తెలియని ఆ ఫొటోలోని వ్యక్తుల గురించి తెలుసుకోవడానికి సుబ్బారావు బంధువులందరినీ కలవాలనుకుంటుంది. ఆ భాగంలో సుబ్బారావు పెద్దక్కయ వాళ్ళింటికి వెళతారు. –ఇక చదవండి



దగ్గర ఆగిపోయింది. ఆ గదికి తాళం వేసుంది. కిటికీ రెక్క ఒకటి కొంచెం తెరిచి వుంది. కిటికీ లోంచి లోపలికి తొంగి చూసింది. ఒక టేబులు కుర్చీ వున్నాయి. వాటి ప్రక్కన దబ్బనాలు ఓ కట్ట వున్నాయి. ఓ ప్రక్కన మంచం... దానిమీద పరుపు దోమ తెర కట్టి వుంది. మంచం ప్రక్కన స్టూలు మీద న్యూస్ పేపర్లు అస్తవ్యస్తంగా పడి వున్నాయి. ఈ రాగిరేకుల కథ ఏంటో తెలుసుకోకుంటే నాకీ రోజు రాత్రికూడా నిద్ర వుండదు అనుకుని మెల్లిగా వంటగదిలో కెళ్ళింది శ్రీవల్లి.

"ఏమ్మా! కాఫీ ఇవ్వనా?" అంది శకుంతలమ్మ.

"అబ్బే! వద్దండి! స్నానం చేశాక ఏకంగా టిఫిన్ చేస్తాను" అంది.

"ఇంకా అండి గిండి అనకు. నన్ను వదినా అని పిలువు" అంది ఆప్యాయంగా బుగ్గ గిల్లుతూ శకుంతలమ్మ.

"అలాగే వదినా! రాత్రి నాకు నిద్ర పట్టలేదు. అన్నయ్యగారు పెరట్లో..." అంటూ ఆపింది సందిగ్ధంగా.

"ఓహో! ఆయన గొయ్యి త్రవ్వి కప్పెట్టడం చూశావా?"

"అవుననన్నట్టు తలూపింది.

"భయపడ్డావా?"

"మరే!" అన్నట్టు మళ్ళీ తలూపింది శ్రీవల్లి.

"పిచ్చిపిల్లా! అంత భయపడాల్సిందేమీ లేదు."

"అన్నయ్యగారు..." అంటూ మళ్ళీ ఆగింది శ్రీవల్లి.

ఈ ఇంటి పరిస్థితులు నీకు తెలియవు కదా! యశ్వంతరావు అంటే నా భర్తవాళ్ళ నాన్నగారికి ఒక్కగానొక్క కొడుకు. బోలెడు ఆస్తి. కొడుకును బాగా చదివించాడు. ఆయన ఉద్యోగం చేస్తానన్నారు. ఉన్నది ఒక్క కొడుకు ఉద్యోగం నెపంతో ఊరు విడిచి, తల్లిదండ్రులను విడిచి వదిలిపోతాడన్న భయంతో, ఇంత ఆస్తికి వారసుడవు, నీకు ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మ ఏమిటి.... ఈ ఆస్తి... ఈ పొలాలు చూసుకో చాలు. పెళ్ళి చేసుకుని వంశాభివృద్ధి చెయ్యి అంటూ ఈయనగారికి కాళ్ళావేళ్ళా పడి, ఏడ్చి శోకాలు పెట్టి ఆయన చేసే ఉద్యోగ ప్రయత్నాలు మాన్పించారు. ఈయనగారికేమో ఉద్యోగం చెయ్యాలనీ... మంచి గుర్తింపు పొందాలనీ ఇష్టం. ఈయన ఆలోచనలకు తల్లిదండ్రులు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. చేసేదేమీ లేక నిర్లిప్తంగా నన్ను పెళ్ళి చేసుకున్నారు. మావాళ్ళు నేను సుఖపడతానని, ఆస్తిమంతురాలినవుతానని ఈయనకిచ్చి కట్టబెట్టారు. నన్ను నాన్నగారు స్కూలు ఫైనల్ దాకా చదివించారు. పెళ్ళయి వచ్చాక సంవత్సరములోపే అత్తయ్య, మామయ్య చనిపోయారు. చాలా చిన్నవయసు... ప్రపంచం గురించి ఏమాత్రం తెలియనిదాన్ని పొలాలు, పాలేర్లు, టౌన్లో బాడుగలకిచ్చిన ఇళ్ళు. వ్యాపారాలలో భాగస్వామ్యం. అన్ని ఒక్కదాన్ని చూసుకోలేక... దుఃఖమొచ్చింది."


"అన్నయ్యగారు?" మధ్యలో ప్రశ్నించింది శ్రీవల్లి.

"అదే చెప్పొస్తున్నాను. ఉద్యోగం చెయ్యొద్దన్నారని ఆయన చాలా నిరాశకు గురయ్యారు. ఎప్పుడూ పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ గడిపేవారు.

ముసలాళ్ళిద్దరూ చనిపోయాక–

"ఇక ఉద్యోగం చూసుకోండి. మనకెలాగూ టౌన్లో ఇళ్ళున్నాయి కదా" అన్నాను.

ఉద్యోగం ప్రయత్నాలు మొదలుపెట్టారు. దాదాపు సంవత్సరం పాటు నిరాశతో నిర్లిప్తంగా, ఏ వ్యాపకమూ లేకుండా గడిపారేమో ఆయనకు పరధ్యాన, మతిమరుప ఎక్కువయ్యాయి. ఉద్యోగపు ఇంటర్వ్యూలలో ఫెయిలయ్యి, ఇల్లు చేరటంతో ఈ మనిషి ఇంకా కుచించుకుని మనిషి డీలా పడిపోయి మరీ పిచ్చివాడిలా అయిపోయారు. అతిచిన్న వయసులోనే పెద్ద బాధ్యతలు తప్పనిసరిగా మీద వేసుకోవాల్సి వచ్చింది.



ఆయనకు పరధ్యానం ఎక్కువవటంతో మా వాళ్ళు మానసిక వైద్యునితో చికిత్స చేయించారు.

ఆయనకు ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకం వుంటే తప్ప జబ్బు బాగవదన్నారు. ఆయన కిష్టమయిన పని ఏదైనా నిరంతరం చేస్తూ ఉండాలన్నారు.

ఆయన కిష్టమైన పని ఉద్యోగం చెయ్యటం. ఉద్యోగం ఇక వచ్చే అవకాశం లేదు. ఇకపోతే ఆయనకిష్టమైన రెండోపని ప్రతిరోజూ న్యూస్ చదవటం, రేడియోలో వార్తలు వినటం. పేపరు ఎంతసేపని చదువుతాడు, డాక్టరుగారు ఏం చెప్పారంటే మీకు పేపరు చదవటం ఇష్టం కదా! అందులో వస్తున్న ముఖ్యమైన వార్తల కటింగ్స్ అన్నీ కలెక్ట్ చేసి ఓ ఆల్బంలా తయారు చేయండి. కొంతకాలం అలా ఏదో ఒక పని చేస్తూ వుంటే నెమ్మదిగా దారిలో పడి ఇంటి పనులు కూడా చూసుకుంటారంటూ సలహా ఇచ్చారు.

ఆయన సలహా పాటించి అన్నిరకాల పేపర్లు తెప్పించి ఆయనకు పని కల్పించాను.

డాక్టరుగారు చెప్పినట్టు ఆయన దారిలో పడ్డారు. కొద్ది కొద్దిగా నా గురించి, సంసారం గురించి ఆలోచించటం, చిన్న చిన్న పనులు చెయ్యటంతో డాక్టరుగారి మందులు, సలహాలు బాగానే పనిచేశాయని సంతోషించాము.

ఓ నాలుగు సంవత్సరాలు సంతోషంగా గడిచిపోయాయి.

సాకేత్, లయ పుట్టారు. సంసారం గాడిలో పడిందనుకుంటున్న టైంలో ఓ రోజు ఉన్నట్టుండి ఈయనగారు టౌనుకెళ్ళిపోయి రెండు రోజులకు వచ్చారు.

మేము చాలా కంగారుపడ్డాము. పోలీస్ కంప్లయింట్ ఇచ్చి పేపరు ప్రకటన వేయిద్దామనుకుంటున్న టైంలో ఓ పెద్దఅట్టపెట్ట నిండా రాగిరేకులతో బస్సు దిగారు.

రాగితో ఏదైనా బిజినెస్‌గాని మొదలు పెడతారేమోనని సంతోషించా.

అదే విషయం ఆయన్నడిగాను.

"మనిషై పుట్టాక ఏదైనా గుర్తింపు పనులు చెయ్యాలి శకుంతలా" అన్నారు.

"గుర్తింపంటే?"


"పూర్వపు రాజుల గురించి చక్రవర్తుల గురించి మన పిల్లలు పాఠ్యాంశాలుగా చదువుకుంటున్నారు కదా! మనగురించి కూడా రాబోవు తరం వారు గుర్తించి కీర్తించాలన్న మాట."

"చెప్పేదేదో సూటిగా చెప్పండి" అన్నాను కోపాన్ని అణచుకుంటూ.

ఆయనముందు కోపం కూడా ప్రదర్శించ కూడదని డాక్టరుగారి సలహా. ఆయన మీద వచ్చే హావభావాలను మ్రింగలేను, కక్కలేను.

"నేటి సమాజంలో జరుగుతున్న తీరు తెన్నులు రాబోవు తరాలు చదువుకునేలా చేయాలనుకున్నాను. అంటే ప్రతిరోజూ న్యూస్ పేపర్లో వచ్చే కొన్ని విలువయిన వార్తలను రాగిరేకుల మీద చెక్కి భూస్థాపితం చేయాలనుకుంటున్నాను. చరిత్రలో నాపేరు చిరస్థాయిగా నిలచిపోవాలంటే ఈ మార్గమే మంచిదనుకున్నాను. ఈ విధంగా నేను గుర్తింపు పొందాలనుకుంటున్నాను. ఏదైనా చెయ్యాలి ఏదైనా చెయ్యాలి అన్నానా! ఆరాటం ఈ ఆలోచనతో సద్దుమణిగింది. భార్యగా నీ వంతు సహకారం కూడా అందిస్తే సంతోషిస్తాను" అన్నారు.

"పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టండి" అన్న సామెత గుర్తుకు వచ్చి స్థాణువైపోయాను.



నచ్చచెప్పబోయాను.

రాగిరేకులకు ఆస్థంతా హరించుకు పోతుంది. పిల్లలు వీధిన పడతారని మొత్తుకున్నాను. వినలేదు. ఆయన తరపు బంధువులతో, మా అమ్మా నాన్నలతో చెప్పించాను. చివరికి ఒక ఒప్పందం కుదిరింది. రోజుకు ఒక్క రాగిరేకులమీద మాత్రమే వ్రాయటం, వారానికోసారి భూస్థాపితం చెయ్యటం... ఇదమ్మా శ్రీవల్లీ... మా ఇంటికథ!" అంటూ ముగించింది శకుంతలమ్మ నిట్టూరుస్తూ.

ఆశ్చర్యంగా అలా నోరు తెరుచుకుని వింటూ వుండిపోయింది శ్రీవల్లి.

"ఏమిటమ్మా! అలా మౌనంగా వుండిపోయావు?"

"ఏం లేదండీ! ఇంత సంసారం, ఇన్ని పాడి పశువులు, పాలేర్లు, పొలాలు, టౌన్లో ఇళ్ళు... ఇవన్నీ చాలక మళ్ళీ అన్నయ్యగారి ప్రవర్తన... ఇవన్నీ భరిస్తూ..."

"ఇవన్నీ భరిస్తూ ఈ కాపురం అవసరమా? స్థిమితంగా బ్రతక్కుండా... ఎందుకొచ్చిన మొగుడు అనుకుంటున్నావు కదూ! ఈ కాలపు పిల్లలయితే ఇలాగే అనుకుంటారనుకుంటా. ఆ రోజుల్లో కూడా నన్నీ కాపురం వదిలి వచ్చెయ్యమని అమ్మనాన్నలతో సహా స్నేహితులు బంధువులు సలహా ఇచ్చారు. కానీ నేను ఒప్పుకోలేదు. నాన్న అన్నారు కదా నాలుగు ట్యూషన్లు చెప్పుకుని అయినా నీ పొట్ట నీవు పోషించుకోలేవా? ఈ పిచ్చివాడితో ఇంత సంసారం వేగలేవు వచ్చెయ్యి" అన్నారు. నేను ససేమిరా అన్నాను."




"ఎందుకని? భర్త లేకుండా సమాజంలో బ్రతకటం కష్టమౌతుందనా? ఆ రోజుల్లో బహుశా అలాంటి పరిస్థితులుండేవనుకుంటా?" అంది శ్రీవల్లి సమాధానం తనే చెప్పుకుంటూ.

"ఈ రోజుల్లో మాత్రం భర్త లేని స్త్రీలు ఉద్ధరించబడుతున్నారా! కాలం మారింది ప్రపంచం మారింది. అంటున్నారు కానీ స్త్రీల విషయంలో సమాజం మారలేదని నేనంటాను. ధైర్యంగా బ్రతికేవాళ్ళు అప్పుడూ వున్నారు. పిరికి ఆలోచనలతో జీవితాన్నించి పారిపోయే వాళ్ళు ఇప్పుడూ వున్నారు. నా సమస్య అది కాదు. అసలు నేనెందుకు కాపురం వదులుకోవాలి? నాకేం తక్కువని? ఎంతోమంది కంటే నేను సుఖంగా వున్నాను. నా భర్తకు పిచ్చికాదు. గారాబంతో తల్లిదండ్రులతనికి ఏం వ్యాపకమూ కల్పించక వచ్చిన మానసిక వ్యాధి. ఏదో చెయ్యాలన్న ఆలోచన తప్ప అతని మెదడులో ఏ కుత్సితాలకూ తావు లేదు. కనీసం కాఫీ టీలు కూడా త్రాగరు.

నేనన్నా పిల్లలన్నా వల్లమాలిన ప్రేమ. పెద్దలు సంపాదించిన ఆస్తి వుంది. నాకే లోటుంది చెప్పు? ఎందుకతన్ని వదిలెయ్యాలి? నా ఎదురుగా నామీద జాలి కురిపిస్తే కూడా నాకు కోపం. ఏదో ఒకరోజుకు ఆయన మామూలు మనిషవుతారన్న నమ్మకం నాకుంది. డాక్టరు సహా పాటించి మందులు వాడుతున్నారు. ఆయన మాటకు ఎదురు చెప్పకుండా ఆయన చెప్పినట్టే చేసుకుంటూ పోతున్నాను. భగవంతుని దయ వలన ఆయన మానసిక వ్యాధి వల్ల ఇతరులకే కష్టం, నష్టం లేదు. అదికూడా అదృష్టంగానే భావిస్తున్నాను" అంటూ ఇంకా మాట్లాడుతున్న శకుంతలమ్మ మాటల కడ్డు తగులుతూ సాకేత్ పరిగెత్తి వచ్చాడు చేతిలో న్యూస్ పేపర్‌తో.

(సశేషం)






కథ

గుటకాయస్వాహా పోటీలు

ఉషస్విని

నాటి నవ్వులు

మూషికాధిరోహుడైన వినాయకుడు భూలోకంలో సంచరించుచుండగా వారికి ఒకానొక కోలాహల ప్రదేశం కనిపించింది.



"స్వామీ! ఏమి ఆ కోలాహలంబు!" అత్యంతాశక్తితో అడిగిన ఆ మూషికి ప్రశ్నకు సమాధానంగా ఆ ప్రదేశాన్ని సమీపించాడు వినాయకుడు.

"ఇచ్చట గుటకాయస్వాహా పోటీలు జరుగుతున్నవి మూషికా!"

"అయితే మీరునూ పాల్గొనవచ్చును కదా!"

"నేనా!!"

"అవును! మీరే ఉండ్రాళ్లు స్వాహా చేయడంలో మిమ్ములను మించిన బొజ్జమూర్తి మరియొకండు లేడు కదా!"

"అవునవును... ప్రయత్నించెదను!!" అంటూ వినాయకుడు తన మూషికంతో పాటు కార్యనిర్వాహకుల దగ్గరకు వెళ్ళాడు.

"ఎవరునువ్వు?" వినాయకుడ్ని చూసిన కార్యనిర్వాహకుడి సూటి ప్రశ్న.

"నేను వినాయకుడ్ని! ఇది నా వాహనం మూషిక!"

"తెలుసులేవయ్యా! నువ్వసలిక్కడికి ఎందు కొచ్చినట్టని?"

"మీరు నిర్వహిస్తున్న ఈ గుటకాయస్వాహా పోటీలలో పాల్గొనేందుకు!"

"మీరు స్వాహా చేయునది ఉండ్రాళ్ళే గదా అయితే రండి!" అంటూ వినాయకుణ్ణి పోటీకి సాదరంగా ఆహ్వానించారు నిర్వాహకులు.

పోటీలో పాల్గొనేందుకు వినాయకుడే కాదు నాయకులు గూడా వచ్చారు. వారితో పాటు కవులు, (అప్ప) కళాకారులు, ఒకటేమిటి! ఎవరి శక్తి సామర్థ్యాలు వాళ్ళవి.

వేగంగా పోటీ ప్రారంభమయింది.

అతి వేగంగా పోటీ ముగిసింది.

కార్యనిర్వాహకులు పోటీ ఫలితాలను ప్రకటించడానికి సంసిద్ధులయ్యారు.

ప్రథమ బహుమతి తనదేననుకుంటూ పాత పిక్చర్‌లో హీరోలా ఓ ఫోజిచ్చి అందరి కంటే

ముందు వరసలో నిలబడ్డాడు వినాయకుడు.

పోటీ ఫలితాల ప్రకటన –

"మేము నిర్వహించిన ఈ గుటకాయస్వాహా పోటీలలో అత్యధిక సిమెంటును గుటకాయస్వాహా చేసిన మంత్రి వినాయకరావ్ గార్కి ప్రథమ బహుమతి ప్రకటించబడింది".

వినాయకుడు ఖంగుతిన్నట్లయింది.

మూషికలో చలనం లేదు.

"అత్యధిక భూములను గుటకాయస్వాహా చేసిన మంత్రి భూపతిరావ్ గార్కి రెండవ బహుమతి ప్రకటించడమైనది".

వినాయకుడికి చెమటలు పట్టాయి. మూషికలో చలనం లేదు. తదుపరి బహుమతి అయిన తనకు రాకపోతుందా అనుకుంటూ... తొండాన్ని ఒకటికి రెండుసార్లు ఎగురవేసుకుంటూ గుండెనిబ్బరం చేసుకున్నాడు వినాయకుడు.

"అత్యధిక గుటకాయస్వాహా చేసిన మంత్రి 'అంతులే'ని ధనాన్ని సంపాదించిన కపోతేశ్వర్రావ్‌కి మూడవ బహుమతి ప్రకటించడమైనది".

"మూషికా! షేమ్... షేమ్, ఎంతటి అవమానం".

"శాంతించండి స్వామీ!"

"ఏమి?"

"కన్సోలేషన్‌లోనైనానూ ఈ ప్రజలు మిమ్ములను గుర్తించకపోరురా?"

నిర్వాహకుని కంఠం – "రెండు కన్సోలేషన్ బహుమతులు!...అత్యధిక పాత రచనలు స్వాహా చేసిన రచయిత 'కాపేశ్వర రావు'కి, అత్యధిక పర భాషా కార్టూన్లు గుటకాయస్వాహా చేసిన 'మక్కీకి మక్కీల'రావుకి లభించాయి.

ఉండ్రాళ్ళను గుటకాయ స్వాహా చేసిన భగవాన్ వినాయకుడికి ఈ సంవత్సరం ఎట్టి బహుమతీ రాలేదు.

వినాయకుడికి ఒక్కక్షణం కూడా ఉండబుద్ధి కాలేదు. వెంటనే అవమాన భారంతో మూషిక మీద ఎక్కి స్వర్గలోకానికి దౌడు తీశాడు.


దారిలో వినాయకుణ్ణి సొంత బర్చే నిమిత్తం "ఇప్పటికైనా ఒప్పుకుంటారా స్వామీ! ఈ ప్రజలు మిమ్ములను ఎంతగా అధిగమించారో!" అని అడిగింది మూషికం.

వినాయకుడేమీ మాట్లాడలేదు. మౌనం అంగీకార సూచికం అయినా ఒప్పుకోక ఏమి చేస్తాడు? పాపం వినాయకుడు!! **(హాస్యప్రియ, సెప్టెంబర్'83)**

చవితి నవ్వులు









కథ

తిరుగుబాటు

ఆరుపల్లి గోవిందరాజులు
8801513061

కాశీపతి సుప్రసిద్ధ రచయిత.

బాలల కోసం సృజనాత్మక నీతి కథలు, యువతరం కోసం ఉద్రూతలూరించే రచనలు, కుటుంబీకుల కోసం సంసార పక్ష రచనలు, రామాకృష్ణ అనే వారికోసం ప్రభోధాత్మక రచనలు సమాజానికి అందించాడు.

ఎన్నో రంగాల్లో ఆరితేరిన వారిని కొందరు ఎలా గుర్తించరో అదే కోవకు చెందిన కాశీపతి ఏనాడూ ఏదీ ఆశించలేదు.

ఒకసారి అదృష్టం పురి విప్పింది.

ఆ ఊరి సాహిత్య సంస్థ కాశీపతికి ఘనంగా సన్మానం చేయదలచుకుంది.

ముందు పేపర్లలో ప్రకటన ఆ తర్వాత బేనర్లు వరకూ వెళ్లింది.

✦ ✦ ✦

ఆ రోజు కాశీపతికి సన్మానం.

అందంగా అలంకరించబడిన వేదిక రచయితలు, సాహిత్యవేత్తలు, అభిమానులుతో కిక్కిరిసి పోయింది. ఎక్కడ నుండి ఎగిరిపడిందో మరి ఓ పూలమాల కాశీపతి మెడలో చోటు చేసుకుంది.

ఒకరిద్దరు వక్తలు లేచి కాశీపతి రచనా కౌసల్యాన్ని వర్ణించి అభినందనలతో ముంచెత్తారు.

వాటన్నింటిని వింటూనే కాశీపతి ఉబ్బితబ్బిబ్బైపోయాడు ఆనందంతో.

ఆ పరిస్థితుల్లో...

'నమస్తే'... రచయితగారూ! అంటూ ఓ స్త్రీ మూర్తి కంఠం వీణ మీటినట్లు పలికింది.

కాశీపతి ఉలిక్కిపడి ఒక్కసారి తలెత్తి చూశాడు

మూడు పదులు కూడా నిండని ఆ నవ యవ్వని తెల్లచీర, జాకెట్టు, నుదుట బొట్టు, కళ్లకు కాటుకతో కనిపించింది.

"ఎవరమ్మా నువ్వూ?" అన్నాడు.

ఆమె నిర్లిప్తంగా నవ్వింది.

ఆమె నవ్వుని జీర్ణించుకోలేని కాశీపతి–

"ఎవరు నువ్వు? ఇక్కడ నాతో ఏంపని?' – అడిగాడు.

తిరిగి ఆమె నవ్వి "అయ్యా రచయిత గారూ అప్పుడే మరచిపోయారూ! మరచిపోతారండీ! మీ కథ 'మళ్లీ తెల్లవారింది' – పోటీలో బహుమతి పదివేలు పొందిన దానిలో మల్లీశ్వరిని! ఇప్పటికైనా గుర్తుకువచ్చానా?

"ఆ! నువ్వా!! మల్లీ ..."

"అవును ముమ్మాటికీ నేనే!"

"ఎలా ఉన్నావమ్మా ... చెప్పు?"

"ఎలా ఉంటాను సార్! మీరు చేసిన యధవ పనికి!"

"మల్లీ! నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెల్సా?"

"తెలుసు సార్! ఆ మాత్రం తెలియకుండా వస్తానా?"

"అయితే నేనేం చేశాను!?"

మీ రచన బిగువు రసవత్తరం కోసం నాకు పెళ్లయిన ఆర్నెల్లకే భర్త వదిలేసి పోయాడు. ఇప్పుడు ఆ యధవ సచ్చినోడు రూపం నాలో పెరుగుతుంది. పైసా ఆదరణ లేని నేను ఎలా బతకాలి? బిడ్డను కని ఎలా పోషించాలి? నా తండ్రి ఎవరు అని వాడు అడిగితే నేనేం సమాధానం చెప్పాలి?... వయసులో ఉన్నాను కదా! రోడ్డున పోయే ప్రతివాడి కన్నూ నా మీదనే! ఏ క్షణం ఏ అత్యాచారం జరుగుతుందో అని భయంతో రోజూ ఛస్తూ బతుకుతున్నాను! అయ్యో! భగవంతుడా నాకెందుకింత అన్యాయం జరిగిందీ?" – ఓ టీ.వి సీరియల్‌లో లేడీ కేరక్టరులా బర్రున చీది చీర పైటతో కళ్లొత్తుకుంది.

రచయిత గారు గ్లాసుడు మంచినీళ్లు త్రాగి–

"అమ్మా! మల్లీ!! నా స్వలాభం, కథ కోసం అలా చేయక తప్పింది కాదు. నీకు అన్యాయం జరిగినది అక్షరాల్లా నిజమే! నేను ఆ పుట్టబోయే బిడ్డ బాధ్యత నెత్తిన వేసుకుంటాను! ఇక నీ రక్షణ మాటకొస్తే... మా మేడ మీద పోర్షను ఖాళీగా ఉంది. అందులో నువ్వు వెళ్లు!'





ఉండొచ్చు. అయితే నా రాక్షసి (భార్య) వఠి అనుమానపు పీనుగు. నేనేదో సెకండు సెటపును పెట్టాననుకుంటుంది. కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి! అప్పుడు నీ సమస్య సాల్వ్ అయిందనుకుంటా!... ఇక వెళ్లు" అన్నాడు.

ఆమె అలా వెళ్ళిందో లేదో ఆ వెంటనే ఒక వ్యక్తి– "అయ్యా! రచయితగారూ!! శతకోటి వందనాలు! మీక్కాదు. మిమ్మల్ని కన్నారు చూశారూ వాళ్లకి!" అన్నాడు.

"ఏమిటా పరిహాసం? అవునూ నువ్వు నా రచన 'కుండకు చిల్లు పడింది'లో గోపాలక్రిష్టవి కదూ! కులాసేనా?"

"కులాసేనా అంటే మరి కులాసాయే!"

కాశీపతికి ఒక్కసారి ఒళ్ళుమండి–

'యెహేయ్! ... ఎక్స్ట్రాలాపి మేటరు చెప్పి తగలడు!అవతల కప్పెట్టినన్ని పనులున్నాయ్!"

"ఇంట్లో పనులంటే పెళ్లాం చీరలు... లంగాలు... బాడీలు ... ఉతకడమే కదా?"

"అద్గో మళ్లీ నువ్వు రాంగ్ రూట్లో పోతున్నావ్? ఇవన్నీ ప్రతి ఇంటా మగాళ్లు చేసే పనులేగా! అసలు మేటరు చెప్పి తగలడు."

"అవును రైటరూ... నాకు తెలియక అడుగుతాను. నీ రచన గొప్పకోసం, నీకు కీర్తి కోసం నన్ను బాగా వాడుకున్నావనే చెప్పాలి. అసలు పాయింటుకి వస్తే నేను చాలీ చాలని జీతంతో సంసారం ఈదుకొచ్చే రోలు నాది. ఏవో నాటకాలు, వేషాలు వేసి నాలుగు డబ్బులు చేతిలో పడితే చిల్లర ఖర్చులు గట్టెక్కి పోతూండేవి. తమరు కలం పదునుతో... 'కుండకు చిల్లు పడింది' నాటిక పరిషత్తుకెక్కించారు... ప్రైజు వస్తే... డొక్కు సైకిలురిపేరు, చిరిగిపోయిన లోపల కట్ డ్రాయర్లు, తుప్పు పట్టిన షేవింగ్ సెట్టు విసిరి కొత్తవి కొనుక్కొందామని కలలు కంటే పదివేలు ప్రైజ్ కొట్టి...ఆ డబ్బుతో ఇల్లు చేరేసరికి అల్లుడు, ఆర్నెల్లు అద్దెకోసం ఇంటాయన కాచుకొని కూర్చుంటే వాళ్లకి పోయడం జరిగింది. థూ! ఇదటయ్యా ఓ బాధ్యత గల రచయిత సాటి మగాడికి చేసేది? యధవ బతుకు ఉంటే ఎంత? లేకపోతే ఎంత..." చెంప చెల్లుమనే విధంగా అన్నాడు.

కాశీపతి ఇరకాటంలో పడ్డాడు.

ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

"ఎక్స్క్యూజ్మీ" మరో కంఠం ధ్వనించింది.

"ఎస్! వాట్ ... డూ యూ...".

"నేను నీ రచన 'అబద్ధాలాడకపోతే'లో హరిశ్చంద్రుడిని.

'అ..వు..నా! ఇదేంటయ్యా' అందరూ కలిసికట్టుగా తిరుగుబాటు చేస్తున్నారూ! నీ ప్రోబ్లమే ఏవో చెప్పి తగలడు. నాకు బోలెడు పనులున్నాయ్".

"సార్... సార్... పూర్వం ఓ కోడలు ఇంటికి అగ్గి తగిలించి అత్తతో నా ఒళ్ళు ఎందుకొ ఒణుకుతుంది అన్నదట! అలా ఉంది మీ వరస. నాచేత హరిశ్చంద్రుడు పాత్ర వేయించి ఆఫీసులో శలవు కోసం బతికి ఉన్న బామ్మను చనిపోయిందని చెప్పించావు. దారి ఖర్చుల కోసం ఎన్నో అబద్ధాలు ఆడించి అక్కడా ఇక్కడా డబ్బు పుట్టించావు.... హరాశ్చంద్రుడు పాత్ర చేత ఇలా చెయించడం బావుందా?"అన్నాడు.

రచయిత గోడలు అదరి పడేటట్లు నవ్వి–


"ఓరి పిచ్చి సన్నాసీ... ఈ రోజుల్లో ఇవన్నీ కామన్ అయిపోయాయి! చిలవలకి పలవలు దిద్దకూడదు. ఇదుగో ఈ ఐదొందలు తీసుకొని

డబ్బు చేతికి అందించాడు.

"నాకెందుకీడబ్బు? నేను తాడో పేడో తేల్చు కోడానికే వచ్చాను!" ఆవేశంగా పలికాడు.

కాశీపతికి గుండెలు అదిరిపడ్డాయి. నచ్చ చెప్పి పంపించాడు.

ఆ వెంట ఓ తల నెరిసిన ఆసామి ప్రత్యక్షమై వినయంగా 'అయ్యా రచయితగార ... నమస్కారం. నేను...." అని తననితాను పరి చయం చేసుకోబోతున్నది చూసి "ఆగు నీ పరిచయం నాకు అక్కర్లేదు. నువ్వు నా చివరకు మిగిలిన కన్నీటి చుక్కలు కథలోని పరంధా మయ్యవి! అవును కదూ!" జ్యోతిష్యుడు చెప్పినట్లు అన్నాడు.




"మరి మీకింత కాలజ్ఞానం తెలిసినవుడు చూస్తూ చూస్తూ ఈ మాయదారి వయసులో ఇంత ఊబిలో ఇరికించడం మీకు ధర్మమా చెప్పండి?"

"అలా అంటే ఎలాగయ్యా' - అది రచన ప్రభావం. గొప్పతనం. సినిమా తీస్తే గొప్ప క్లైమాక్సు అవుతుంది".

"గాడిదగుడ్డూ ... కంకరపీసూ కాదు మరీ! లేకపోతే ఏమిటయ్యా, నీ రచన సౌలభ్యం కోసం నిన్ను అందరూ ఆహా! ఓహో అని ప్రశంసించడం కోసం నేను అష్టకష్టాలు పడి పెళ్లి చేసిన అమ్మాయిని పురిటి నొప్పులతో కన్ను మూయించేశావు! పోని అక్కడితో ఊరు కున్నావా? అదీ కాదు అన్నట్లు అల్లుడిని పక్కింటి పిల్లల తల్లితో ప్రేమవ్యవహారం సృష్టిం చి అల్లకల్లోలం చేసి ఊపేశావు. అంతే కాకుండా అబ్బాయిని ఎదురింటి అమ్మాయితో లవ్ గేమ్ ఆడించి లేవదీసుకుపోయినట్లు చేశావు! ఇప్పుడు నేనెలా బతకాలి? నా ఆత్మ క్షోభ నీకు తగలక మానదు! నువ్వు ఈ జన్మలో సుఖపడవు!" శపించినట్లు మాట్లాడాడు.

అంతావిని రచయిత-"ఇదుగో పెద్దాయన! ఈ వయసులో మీకింత ఆవేశం తగదు! బి.పి. రైజయిపోతే ప్రమాదం! కూల్‌డౌన్ ... కూల్ డౌన్! పాయింటుకంటూ వస్తే నేనేం సుఖంగా ఉంటున్నాననుకుంటున్నావా? నెవ్వర్! రచయి తలు కథను బట్టి అనేక సమస్యలు సృష్టిస్తారు. అవి కొన్ని వారి స్వానుభవాలు అయితే, మరి కొన్ని రూపకల్పన కావచ్చు! అది ఆ రచయిత నైపుణ్యం బట్టి ఉంటుంది. బాగా విను. వయసులో ఉన్నప్పుడు నేను అందరిలా ప్రేమ లో పడ్డాను. చివరకు కావేరి లేకుండా జీవితం వ్యర్థం అనిపించింది. కాని విధి వక్రీకరించి ఇద్దరం చెట్టుకో పిట్ట అయిపోయాం! ఆ తర్వాత మరో అమ్మాయితో వివాహం జరిగి పిల్లలు...సంసారం...యాంత్రికంగా జరిగి పోయాయి! కష్టాలు నీకే కాదు! నాలాంటి వాడి కీ ఉంటాయి. విన్నావుగా. ఇక దయచెయ్యి!"



పంపించాడు.

ఆ వెంటనే టప్ టప్ మని అరిచేతులు చప్పుడు వినబడి తలెత్తి 'ఆ నువ్వా!' అన్నాడు.

"నేనే భాయా! నీ కథ చూడు పిన్నమా పాడు పిల్లోడులోని శివంగిని!"

'ఆ! అయితే ఇక్కడ నాతో ఏం పనీ?"

'భాయ్యా... మరి అలా అంటే ఎలా?"

"అసలు నువ్వు ఇక్కడకు ఎందుకొచ్చావ్?"

"ఈ మధ్య ఒంట్లో అస్సలు బాగోవడం లేదు భాయ్యా. ఏదో పుల్ల పుల్లగా తినాలని పిస్తుంటే డాక్టర్ దగ్గరికి పోవాలి... నా దగ్గర డబ్బు లేదు. అందుకే నీ దగ్గరకొచ్చింది" అంటూ మీద మీదకు ఉరికింది.

"అరె... ఇలా మీదకు వస్తావేంటి? ఇంద ఈ మూడొందలు తీసుకొని వెళ్లు. మరెప్పుడూ రాకు!" అన్నాడు.



"సరే"-అంటూ వెళ్లిపోయింది.

ఆ వెంట మరో అభాగ్యుడు ప్రవేశించాడు.

"ఆఁ... విశ్వం! నువ్వా?"

"అవును సార్! మీ రచన జాలిలేని బ్రహ్మయ్యలోని విశ్వాన్ని!"

"అదేమిటి అలా చిక్కిపోయావు! మాసిన గడ్డాం, చిరిగిన దుస్తులు,విరిగిన చెప్పులు... నిజంగా నేను చాలా చాలా విచారిస్తున్నా!"

"విచారం దేనికి సార్! మీరు చేసిన అవక తవక పనులకి ఇలా ఉండకపోతే ఎలా ఉండ గలను! చేసిన అన్యాయంకి సిగ్గు పడండి!"

"ఏం చేశాను! ఏదో గుర్తుకు రావడం లేదే!" అన్నాడు.

"ఊర్కోండి సార్! ఎవరైనా వింటే నవ్వి పోతారు! ఉద్యోగం సద్యోగం లేని నన్ను మీ కథ రక్తి కోసం పెళ్లి జరిపించేశావు. ఆదర్శం అంటూ కాని కట్నం లేకుండా మరీ అమ్మా యిని అంటగట్టావు. పోనీ అంతటితో ఊరు కున్నావంటే -అదీ కాకుండా రెండు నెలలకే నేను తండ్రిని కాబోతున్నట్లు డిక్లేర్ చేసావు. ఇది నీకు ధర్మమా?" - అన్నాడు.


కాశీపతి కొంచెం ఆలోచించి "నాకు నీ మీద కోపం ఎందుకయ్యా! కథనం కోసం తప్పదు మరి! ఇప్పటికీ నువ్వు నిరుద్యోగివి. కనుక ఓ పని చేయ్! నేను అచ్చు వేయించు కొన్న ఎన్నో పుస్తకాలు మిగిలిపోయి అలాగే పడి ఉన్నాయ్. కష్టపడి అమ్ము కున్నావంటే కొంతలో కొంతయినా డబ్బు రావచ్చు. టూ పర్సంట్ నాకివ్వు. పాపం ఆ ప్రెస్సువాడు చాలా బాధల్లో ఉన్నాడు. కొంతలో కొంత యినా ఇచ్చి రుణం తీర్చుకుంటాను. వెళ్లు" అని పంపించాడు.

కాశీపతి మస్తిష్కం వేడెక్కి పోయింది. బయటనుంచి సన్నగా ఏవో కేకలు, చప్పుడు వచ్చింది. బయటకు వచ్చి చూసాడు. కొందరి చేతుల్లో బేనర్లు, కట్ అవుట్లు పట్టుకొని "సీతా పతి డౌన్...డౌన్... మాకు న్యాయం కావాలి!" అంటూ అరుపులు!

సీతాపతికి ఒళ్లు మండి "స్టాపిట్! అసలు రచయిత అంటే ఏమనుకుంటున్నారు? రచయితలకీ కన్నీళ్లు, కష్టాలు ఉంటాయి. ఆశలు, ఆశయాలు ఉంటాయి. రచయిత ఎన్నో సృష్టిస్తాడు. అది తన కర్తవ్యం కూడా!" గట్టిగా కలవరించడంతో పక్కలో భార్య- "బాగానే కలవరిస్తున్నారే! ఇంకా సన్మానంకి వారం రోజులుంది" చేత్తో కుదిపింది.

కాశీపతి ఒక్కసారి కళ్లు తెరిచాడు.

ఎదురుగా అరల్లో తన పుస్తకాల మీద తను సృష్టించిన బొమ్మలు చిద్విలాసంగా నవ్వుతు న్నట్లు కనిపించాయి.





వెంగళ్రావ్ వేలంవెర్రి

కథ

శ్రీష్టి శేషగిరి
9290652632

"కాంతం... ఒసేవ్ కాంతం! త్వరగా బయటకు రా ... అంటూ గావుకేక వేశాడు వెంగళ్రావ్ వెర్రి ఆనందంతో.

ఆ అరుపు విని కాంతం గుండె ఝల్లుమంది. 'మళ్లీ ఏం విపరీత బుద్ధి పుట్టిందీ ఈయన గారికి' అనుకుంటూ నెమ్మదిగా బయటకొచ్చింది.


ఆమె అలా అనుకోవడానికి కారణం .... వెంగళ్రావ్ వయసు యాభైసంవత్సరాలు. అతనికి తాత, ముత్తాతలు ఇచ్చిన ఆస్తి బోలెడంత ఉంది. దానికి తోడు అతగాడికి వేపకాయంత వెర్రి కూడా వుంది.

తిని తొంగుంటే మనిషికీ, గొడ్డుకూ తేడా లేదని అప్పుడెప్పుడో మహానుభావుడు రావు గోపాలరావు గారు అనగా విన్నాడు. అందుకే కళాపోషణగా ఏం చెయ్యాలా అని తెగ ఆలోచించాడు.

అలా ఆలోచించగా... చించగా... అతని బుర్రలో పురుగులా, చీకటిలో చిన్న వెలుగులా ఒవైడియా తట్టింది కాదు పుట్టింది.

కాదేది కవితకనర్హంఅని శ్రీశ్రీ మహాకవి గారన్నట్లు... కాదేది హాబీకి అనర్హం అనుకున్నాడు. వేలంపాట ద్వారా ప్రపంచంలోని గొప్ప గొప్ప వస్తువులని, ప్రముఖ వ్యక్తుల తాలుక జ్ఞాపకాలని సొంతం చేసుకోవాలనే కోరిక కలిగిందతనికి.

గుప్తుల కాలం నాటి గుండుసూది నుండి బ్రిటిష్ కాలం నాటి బ్రాందీ సీసా వరకు అన్ని ఇంటర్నెట్‌లో లభిస్తాయని ఎవరో చెప్పగా విన్నాడు. వెంటనే వేలం వెర్రిగా వెబ్ సైటులలో వెతకనారంభించాడు వెంగళ్రావ్.



అలా వెతికి వెతికి విలువైన వస్తువులు అంటూ అడ్డమైన చెత్తా చెదారాలన్నీ వేల దాలర్లు పోసి కొనేవాడు. అతనికున్న ఈ వింత అయిన వేలం వెర్రి హాబీనీ చూసి నవ్వుకుంటూ అతని బంధుమిత్రులు వేలం వెంగళ్రావ్ అని పిలవనారంభించారు.

అతనిలో వున్న ఈ వెర్రిని తెలివిగా క్యాష్ చేసుకొనే వారు కొందరు. ఆ కొందరిలోనే ఆ వీధిలోనే వుండే సుబ్బారావు ఒకడు.

ఓసారి ఆ సదరు సుబ్బారావు శిధిలావస్థలో వున్న ఓ వాహనాన్ని తీసుకొచ్చి... కాదు కాదు తోసుకొచ్చాడు.

"వెంగళ్రావ్... ఏమోయ్ వెంగళ్రావ్! ఇలా బయటకు రా ఓసారి. చూడు నీకోసం ఏం తెచ్చానో" అన్నాడు తెగ ఆయాస పడిపోతూ.

"ఏంటా వింత వస్తువూ?" అని వెంగళ్రావ్ తెగ ఆశ్చర్యపోయి నోరు తెరచుకొని చూస్తుండిపోయాడు.

"ఇది బ్రిటిష్ కాలంనాటి వాహనమోయ్. మా తాతకు దీన్ని అప్పట్లో తెల్లదొర బహుమానంగా ఇచ్చాడట దీన్ని. నీ హుందాని చూసి ముచ్చటపడి, గర్వపడి ఇది నీ దగ్గరుంటేనే బాగుంటుందని చచ్చీ చెడీ తోసుకొచ్చాను. సారీ...తీసుకొచ్చాను." అంటూ చెప్పి అతని కళ్లలోకి సూటిగా చూశాడు సుబ్బారావు.

వెయ్యి ఏనుగులెక్కినంత సంబరమేసింది వెంగళ్రావ్‌కి. బ్రిటిషు కాలంనాటి వాహనాన్ని తాను సేకరించడం నిజంగా గర్వంగా అనిపించిందతనికి.

"ఇంతకూ దీన్ని ఎంతకు అమ్మాలను కొన్నావోయ్?" అని అడిగాడు సుబ్బారావుని.

అతని వీక్‌నెస్ గ్రహించిన సుబ్బారావు పది వేల నుండి మొదలెట్టి లక్షకు అంటగట్టాడు వేలం వేసి.

అది తెలిసిన అతని భార్య కాంతం నెత్తి నోరు బాదుకుంది.

"ఏంటీ ... ఏంటేంటీ పాత సామాను వాడు పాతిక రూపాయలకు కూడా కొనడానికి వెనకాడే ఆ వింత వాహనాన్ని మీరు వేలం పాటలో వెర్రివాడిలా లక్ష రూపాయలకు కొన్నారా?


మీ వేలం పిచ్చి పాడుగాను. మిమ్మల్ని కాదండీ ఆ సుబ్బారావుగాడినవాలి. మీ వీక్‌నెస్‌ని పసిగట్టి తెలివిగా క్యాష్ చేసుకొంటున్నాడు. దొంగసచ్చినోడు. ఆడిజిమ్మడ..." అంటూ నాలుగు నాటుతిట్లు గాటుగా తిట్టింది.

అలా కొంతకాలం గడిచింది. ఒకనాడు వెంగళ్రావ్ ఎంతో హుషారుగా ఇంటికొస్తున్నాడు. బయటనుండే "కాంతం! కాంతం... ఈ రోజు వేలంలో ఏం కొన్నానో తెలుసా?" అన్నాడు గర్వంగా.

"కాంతం ఈరోజు ఏం కొన్నానో తెలుసా?" అని అడిగాడు వెంగళ్రావ్ వెర్రి ఆనందంతో విర్రవీగుతూ.

"ఆఁ! ఏముంటుంది!? ఏ మురికి గుంటలోని గాజు సీసానో లేక రోడ్డు పక్కన వాడి పడేసిన ఆవకాయ జాడీనో అయ్యుంటుంది" అంది నిర్లిప్తంగా కాంతం.

"అబ్బా! ఆపవే నీ నస! ఎప్పుడు నన్ను కించపరచడమే తప్ప నాలోని కళాకారుడిని గుర్తించి గౌరవించడం తెలీదు నీకు." అంటూ ఓ ప్యాకెట్టులో నుంచి ఓ వస్తువుని బయటకి తీసాడు.



రంగురంగుల కాగితంలో నుండి చీకి .... చినిగిపోయిన బ్రాని బయటకు తీసి చూపించాడు.

"ఛీ! ఛీ... ఏ పెంటకుప్ప మీద నుండి ఏరుకొచ్చారండీ దీన్ని?" అవతల పారేయండా దరిద్రాన్ని." అంది చిరాకుగా మొహం పెట్టి కాంతం.

"ఒసేవ్... ఒసేవ్! ఇది పెంటకుప్ప మీద్దీ కాదే పిచ్చి మొహమా.... అప్పుడెప్పుడో విక్టోరియా రాణి వేసుకొన్నదట ఇది. ఆ సుబ్బారావుకు ఎవరో అమ్ముతుంటే నాకు చెప్పాడు. వంద డాలర్లు పెట్టి కొన్నాను" అన్నాడు మహదానందంగా.

"మీ వెర్రి బంగారం గాను. అర్థరూపాయి విలువ చెయ్యని దాన్ని వెయ్యి డాలర్లు పోసి మరీ కొన్నారా? మీకు రాను రాను పిచ్చి ఎక్కువవుతుందండీ. ఇలాగైతే మీ వేలంవెర్రితో ఆస్తి హరీమంటుంది" అంటూ నెత్తి నోరు కొట్టుకుంది కాంతం ఎప్పటిలాగే.

కాంతం కన్నీళ్లు ఏ మాత్రం పట్టని వెంగళ్రావ్ యథావిధిగా తన వేలంపాట కోసం వెయ్యి విధాలా ప్రయత్నాలు సాగిస్తూనే వున్నాడు.

ఓ శుభదినాన్న వెంగళ్రావ్ వెర్రిగా అరుస్తూ వచ్చాడు. "కాంతం... కాంతం!" అంటూ ....

మళ్లీ ఏం కొని కొంపమీదకు తెచ్చాడో అనే అనుమానంతోనే బయటకొచ్చింది కాంతం.

"ఇదేంటో తెలుసా?" అని రంగు రంగుల కాగితంచుట్టున్న ఓ సీసాలాంటి దాన్ని చూపిస్తూ కాంతాన్ని అడిగాడు.

కాగితం విప్పగానే లోపల కనిపించిన వస్తువుని చూసి మొహం ముడుచుకుంది ఎప్పటిలానే కాంతం.

"ఏంటే అలా మొహం మాడ్చుకున్నావు. ఇదేంటో తెలుసా నీకసలు? ఇదీ.. ఇదీ...



సాక్షాత్తు ఎలిజబెత్ రాణి తాగి పారేసిన వైన్ సీసా. రెండు వందల పౌండ్లు పోసి మరీ కొన్నాను. ఏమనుకున్నావో" అన్నాడు దర్పంగా.

"ఓసి మీ మొహం మండా! ఏంటండీ మీ పిచ్చి కాకపోతే. చెత్తకుప్పలో పారేసిన ఆ పనికి రాని సీసాని అంత డబ్బు పెట్టి కొన్నారా? మీ చాదస్తం తగలెయ్య. అటు వంటివి ధర్మాసుపత్రి పక్కనే పడి వుంటాయి. ఏరుకొచ్చుకోండి ఫ్రీగా" అంటూ లబోదిబోమంది కాంతం.

"అబ్బా ఆపవే నీగోల! ఎప్పుడూ ఏదో వంక పెడుతూనే వుంటావు. నీ అనుమానం సంత కెళ్లా. నువ్వు అలాగే అంటూండు. ఏదో ఒక రోజు నేను ఈ సేకరించిన అపూర్వ వస్తువులతో ఓ మ్యూజియం పెడతా... అప్పుడు చూపిస్తా నా తడాఖా!" అన్నాడు ఆవేశంగా వెంగళ్రావ్.

"ఆ పెట్టండి... పెట్టండి! అది చూసిన జనం నీకు పిచ్చి పట్టిందని తీసుకెళ్లి పిచ్చాసుపత్రిలో పారేస్తారు. పీడా విరగడైపోతుంది." అంది కాంతం యధాలాపంగా.

ఆమె ఎన్ని మాటలన్నా సరే ఏమాత్రం పట్టించుకోడు వెంగళ్రావ్. పడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదు. అని అతని నాయనమ్మ తరచు చెప్తూండేదట.

కాలం పరిగెడుతుంది. వెంగళ్రావ్‌తో వెర్రి కూడా అంతే వేగంగా పరుగులు తీస్తుంది.

అతను ఇల్లంతా జపాన్ రాజు వాడిన జగ్గులతో, మంగోలియా రాజు వాడి పారేసిన మగ్గులతో నిండిపోతుంది రోజు రోజుకు.

వెంగళ్రావ్‌కు తాను సేకరించిన వస్తువులతో ఎప్పటికైనా ఓ ప్రదర్శనని ఏర్పాటు చేయాలని బుర్రలో పురుగు తొలచింది. అంతే ఇక దాని గురించి తెగ ఆలోచించ సాగాడు రేయింపవళ్ళు.

అలా ఆలోచిస్తూండగా అతని మిత్రుడు పరిగెత్తుకొచ్చాడు "వెంగూ...వెంగూ..." అంటూ ఆయాసపడుతూ.

అతడు రావడానికి కారణం లేకపోలేదు. మళ్లీ ఏదో వస్తువు ఏరుకురావడం దాన్ని ఈ వెర్రిబాగులోడికి వేలంలో అమ్మడం, దాన్ని ఎంతో ఇష్టంగా కొనడం... కాంతం లబోదిబో మనడం ఇవన్నీ వెనువెంటనే జరిగే కార్యక్రమాలు.

"వెంగు! నీకోసం ఏం తెచ్చానో తెలుసా?" అంటూ చేతి సంచిలోనుండి ఓ వస్తువుని బయటకి తీసి చూపాడు.

"ఏంటోయ్ అది?" అని అడిగాడు ఆశ్చర్యానందంగా.

అతని ఆసక్తి గమనించిన అతని మిత్రుడు 'ఎదవ మళ్లీ బుట్టలో పడ్డాడు.' అనుకున్నాడు మనసులో నెమ్మదిగా.


"ఇదీ... ఇదీ...ఇదేంటో తెలుసా?" అంటూ కాగితం చుట్టలు విప్పి ఓ పెన్నులాంటి వస్తువుని బయిటకు తీశాడు.

"ఎంట్రా అదీ? త్వరగా చెప్పి తగలడు. నాకు టెన్షన్‌గా వుంది." అన్నాడు వెంగళ్రావ్.

"ఇదీ ... ఇదీ ... అలనాటి ఇంగ్లాండ్ కవి రాసిన పెన్నురా. ఎవరో వేలం వేస్తే నీకోసం జస్ట్ మూడు వందల డాలర్లు పెట్టి కొన్నా. నీకోసం నీలోని కళాకారుడికోసం. నీ కళా తృష్ణ తీర్చడం కోసం" అంటూ నాలుగైదు డైలాగులు వేసాడు భారంగా.

ఈసారి కాస్త భారీగానే వసూలుచేద్దాం అని మనసులో బలంగా ఫిక్సయిపోయాడు.

"అవునా? ఇది ఇంగ్లండ్ కవి రాసిన పెన్నా? ఆహా! ఏమి నా అదృష్టం. ఏమి నా




భాగ్యం.... ఎక్కడ ఇంగ్లాండు ఎక్కడ వెంగ శ్రావ్. అహో... ఓహో..." అంటూ ఆ పెన్నుని చూస్తూ పరవశించిపోయాడు... మైమరచి పోయాడు వెంగశ్రావ్.

వెంటనే అతనికివ్వాల్సిన డబ్బులిచ్చి దాన్ని అమాంతం సొంతం చేసుకొన్నాడు.

"ఏమేవ్ కాంతం! చూడవే... ఈసారి ఏం తెచ్చానో... ఎప్పుడూ నన్ను దెప్పిపొడవడమేగా నీ పని. ఈసారి చూడు ఎంత గొప్ప వస్తువుని సొంతం చేసుకొన్నానో. ఇప్పటికైనా నీకు నా గొప్పతనం తెలిస్తే అదే చాలు." అంటూ వీర లెవెల్లో ఆమెకు ఆపెన్ను చూపించాడు.

"ఏమిటండీ ఇది? ఏ పెంటకుప్పలోంచి ఏరుకొచ్చారండీ దీన్ని ?" అంది కాంతం దాన్ని చూస్తూనే మొహమంతా చిటపటలాడిస్తూ.




"ఒసేవ్! నీకు ఆర్ట్‌ని ఆర్టిస్ట్‌ని గుర్తించడం గౌరవించడం రావే. ఇది పెంటకుప్ప మీద పారేసిందా? కాదు. కాదు. కానేకాదు. ఇది సాక్షాత్తు ఇంగ్లండ్ కవి రాసి పారేసిన పెన్నే ఇది. వేలంలో జస్ట్ ముదు వందల డాలర్లకు నా ఫ్రెండ్ ద్వారా కొన్నాను." అన్నాడు గాల్లో తేలిపోతున్న ఆనందంతో.

"ఏడ్చినట్లే వుంది. మీకు రాను రాను ఉన్న మతి పోతుందండీ."అని నెత్తి నోరు బాదు కుంది కాంతం ఎప్పటిలానే.

"అదంతా నాకు అనవసరం. నాకు ఇక్కడ ఏం అనిపిస్తే అదే చేస్తా. ఎవరేం అనుకున్నా సరే. అని అదేదో సినిమాలో హీరోలా డైలాగ్ కొట్టాడు వెంగశ్రావ్. ఎవడి పిచ్చి వాడికానంద మంటే ఇదే మరి. అనుకుంది కాంతం.

అతని వింత వస్తువులతో ఇల్లు, వాకిలి అంగుళం ఖాళీ లేకుండా నిండిపోసాగింది.

ఇక ఎలాగైనా ప్రదర్శన పెట్టాలని అను కున్నాడు. వెంటనే ప్రారంభించాడు. ఆ ప్రదర్శ నకు స్థానిక సి.ఐ. కూడా వచ్చాడు. అతడు ఆ ప్రదర్శనలోని వస్తువులని తిలకిస్తూ, తిల కిస్తూ టక్కున ఓ చోట ఆగిపోయాడు. అక్కడ కనిపించిన ప్రదర్శిస్తున్న గన్నుపై అతని దృష్టి పడింది. దాన్ని చూడగానే ఆ సి.ఐ.లో ఆవేశం ఆనందం పెల్లుబికాయి. అది మామూలు గన్ను కాదు. తన ఉద్యోగాన్ని ఊడపీకిన తన సర్వీసు గన్ను. అటువంటిది కంటికి ఎదురుగా కనిపించేసరికి ఎగిరి దూకినంత పని చేసాడు సి.ఐ 'హురేకా, హురేకా' అంటూ.



ఎందుకని అతడు అలా అరిచాడో వెంగ శ్రావ్‌కి అర్థం కాలేదు. బహుశ అతను సేకరిం చిన వస్తువులు చూసి పిచ్చెక్కిందేమో సి.ఐ.కి అని జనాలు అనుకోసాగారు.

"ఏరా వెంగశ్రావ్! నా రివాల్వరే కొట్టేసి ఎంచక్కా ఎగ్జిబిషన్‌లో పెట్టేసి నన్నే చూడ్డానికి రమ్మంటావా? ఎన్ని గుండెలురా నీకు. నువ్వు చేసిన ఈ పని వల్ల నేను సస్పెండ్ అయ్యాను తెలుసా?" కొట్టబోయాడు సి.ఐ. ఆవేశంగా.

"సార్! నాకు ఏ పాపం తెలీదు సార్. అది హిట్లర్ వాడిన గన్నుని ఎవడో తెచ్చి నాకు అంటగట్టాడు సార్. నన్ను క్షమించండి సార్" అంటూ కాళ్ల వేళ్లా పడ్డాడు వెంగశ్రావ్.

"అలాగే క్షమిస్తాను. కానీ ఒక షరతు ఇక నుండి నీ వేలం వెర్రిని వదులుకుంటానని రాసివ్వు." అంటూ హుంకరించాడు.

"అలాగే సార్. ఇక జన్మలో మళ్లీ ఈ వేలం వస్తువులను కొనను గాక కొనను." అన్నాడు దీనంగా.

"హమ్మయ్య. ఇలాగైనా నా మొగుడి తిక్క కుదిరింది. నాకదే చాలు అని మనసులో తెగ సంతోషించింది కాంతం.



కథ

సరదా బిజినెస్

అల్లం శశిధర్
98490 75672

"రావుగారు! ఇంటికి వెళ్లేటప్పుడు దారిలో ఈ అడ్రస్ వుంటుంది. అక్కడ ఈ యాభై వేలు కట్టేసి, రశీదు తీసుకొండి" ఆర్డర్ వేసినట్టు చెప్పాడు నాకంటే పెద్దవాడైనా పుణ్యమూర్తిగారు.

"అలాగే సార్! తప్పకుండా" అని వివరాలు అడక్కుండా డబ్బుని, అడ్రస్ కాగితాన్ని తీసుకొని చూస్తే- పి.కే.ఆర్ట్స్ అని రాసి క్రింద అడ్రస్ వుంది.



"మరిచిపోవద్దు... జాగ్రత్త" కళ్లు పెద్దవి చేసి మరీ మరీ చెప్పాడు.

"అబ్బే! ఎందుకు మరిచిపోతాను సార్" అని జాగ్రత్తగా పెట్టుకున్నాను.

గడియారం అయిదు గంటలు 'టింగు.. టింగు'మని కొట్టింది. బయల్దేరాను.

అడ్రస్‌లో వున్న పి.కే.ఆర్ట్స్ కోసం వెదకటం మొదలుపెట్టాను. దొరకడం లేదు.

ఓ వ్యక్తిని అడిగాను.

"పి.కే.ఆర్ట్స్ నా?! ఏం పీకుతారు వాళ్లు" నిర్లక్ష్యంగా అన్నాడు.

వాళ్లు ఏం పీకుతారో తెలియదు కదా..! వదిలేశాను.

మరోక వ్యక్తిని విచారిస్తే...

"పి.కే.... అనగానే "పినేకే లియే విస్కీ హైనా... పుదర్ జావో... బ్రాంది షాప్ హై" అని దారి చూపించాడు.

ఒక్క విషయాన్ని ఒక్కో రకంగా అర్థం చేసుకుంటున్నారు.

లాభం లేదనుకొని ఈ పి.కే. ఆర్ట్స్ సంగతి తేల్చివేయాలని నేనే తిరిగి తిరిగి పట్టుకున్నాను.

అది ఒక ఖరీదైన బంగళా. పి.కే. ఆర్ట్స్ అంటే ఆఫీసు అయివుండాలిగా.. అనుకుంటూ మెల్లిగా అనుమానంగా లోపలికి వెళ్లబోతుంటే....

నాకోసమే ఎదురుచూస్తున్నట్టు ఒక వ్యక్తి.. వైట్ & వైట్ షర్ట్, లుంగితో బయటికి వచ్చి...

"రండి! ప్లీజ్ కమ్..." అని లోపలికి ఆహ్వానించాడు.

అతన్ని చూస్తే ఆవులిస్తే పేగులు లెక్కించే వాడిలాగా వున్నాడు.

ఇంట్లోనే ముందు గదిని ఆఫీసుగా సెటప్ చేశాడు.

పని చేసే సిబ్బంది వున్నారో లేరో కానీ అక్కడ ఎవ్వరూ లేరు.

ఆఫీస్ నిండా రకరకాల మెమోంటోలు, మెడళ్లు, ప్లాస్టిక్ పూల దండలు, సుమారు ముప్పైరకాల శాలువాలు, గోడకు రవీంద్రభారతి, త్యాగరాయ గాన సభ... ఇంకా కొన్ని ఆడిటోరియాల పెద్ద ఫోటోలు వ్రేలాడుతున్నాయి.

"పుణ్యమూర్తి గారు పంపించారా... నేనేదో కొత్త కష్టమర్ అనుకున్నాను" మాటల్లో కాస్త నిరాశ ధ్వనించింది.

ఇతను ఏం సప్లై చేస్తాడు... వేటిని అమ్ముతాడు.. అర్థం కావడం లేదు.

"ఇదిగోండి సార్! యాభైవేలు. చూసుకోండి" అని అతనికి ఇచ్చాను.

ఒక్కసారి నోట్ల కట్టను జాగ్రత్తగా చూసి డ్రాయర్‌లో దాచేశాడు.

రసీదు బుక్కు తీసి.. రాసి.. రిసీట్ ఇచ్చాడు.

అందులో సన్మానం కోసం అడ్వాన్స్ అని రాసుంది.

నాకర్థం కాలేదు. "సన్మానం కోసం ఏంటీ" అడిగాను.

"పుణ్యమూర్తి గారికి సన్మానం చేస్తున్నాం.

దానికి డబ్బు పంపాడు." అన్నాడయన.

పుణ్యమూర్తిగారు... సన్మానం... డబ్బు పంపడం... ఒక్క ముక్క అర్థం కావడం లేదు. ఆయన నా వైపు అమాయకుణ్ని చూసినట్టు చూసి... పరిహాసంగా నవ్వి..

"రకరకాల మనుషులకు రకరకాల కోరికలు...కలలు...గులలు...సరదాలు వుంటాయి. అవి తీరితే వారికి ఆనందం. డబ్బు లేని వారికైతే కలలు, కోరికలు కల్లలైపోతాయనుకో! అదే డబ్బున్న వారికి... డబ్బు ఖర్చు పెట్టే తీర్చుకుంటారు. కొంతమంది సినిమా వాళ్లకు అవార్డులు ప్రకటించి పెద్ద ఎత్తున ఫంక్షన్ చేసి కోట్లు ఖర్చుపెట్టి తీర్చుకుంటారు. కొందరు కోట్లు ఖర్చుపెట్టి ఎమ్మెల్యే.. ఎంపీలై సరదా తీర్చుకుంటారు. కొందరికి పబ్లిసిటీ పిచ్చి. మరి కొందరికి పబ్లిక్ ఫిగర్ కావాలనే పిచ్చి. ఎవడి పిచ్చి వాడికి ఆనందం. మనం వారి పిచ్చిని.. సరదాని తీర్చడం... ఆనందం పరచడం... డబ్బు సంపాదించడం.. ఇది మా వృత్తి" స్పష్టంగా వెల్లడించాడు ఆయన.

విషయం అర్థమైంది.

"అంటే మీరు డబ్బు తీసుకుని సన్మానాలు గట్రా చేస్తుంటారా"

"అవును! వారి వారి స్తోమతను బట్టి సన్మానం వుంటుంది... సామూహిక వివాహాలులాగా... సామూహిక సన్మానాలు కూడా వుంటాయి. ఒక్కరికే స్పెషల్‌గా సన్మానం చేస్తూ.. వి.ఐ.పి. లను, సినిమా గ్లామరును, మీడియాలో కవరేజీ కావాలంటే మాత్రం ఖర్చు మాత్రం ఎక్కువవుతుంది."

"ఇంతకీ మా పుణ్యమూర్తి గారు ఏం సాధించారని సన్మానం చేయించుకుంటున్నారు."

"అదేంటండీ... సంపాదన లేనోడు పెళ్లి చేస్కోవడం లేదా? అనర్హులు అందలం ఎక్కడం లేదా! సన్మానానికి డబ్బు కడితే చాలు. ఎందుకు సన్మానించాలో మేమే నిర్ణయిస్తాం. ఇక పుణ్యమూర్తిగారు చాలా సంవత్సరాలుగా ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తూ... ప్రజాసేవ చేస్తున్న సందర్భంగా సన్మానం"

నాకు ఆశ్చర్యం వేసింది.

"ఆయన ప్రజాసేవ కాదు... లంచాలు తింటూ ప్రజాషేవ్ చేస్తున్నాడు. అలాంటివాడికి సన్మానమా...!?" నా కొంచెం కోపం వచ్చింది.

"మొత్తానికి ఈ సన్మానాల వల్ల మీకు బాగానే గిట్టుబాటు అవుతుందా."


"పర్లేదు. ఇప్పుడిప్పుడే ఈ రంగం డెవలప్ అవుతోంది. దీనికి మంచి పొటెన్సియాలిటి వుంది. నా వుద్దేశ్యం ప్రకారం ప్రతీ సంవత్సరం డబుల్... ట్రిబుల్ వృద్ధిరేటు సాధిస్తుంది. గొప్ప భవిష్యత్తు వున్న ఫీల్డిదని నా అభిప్రాయం" -ఈ రంగాన్ని ఎంతో విశ్లేషణ చేసిన వాడుగా విడమరిచి చెప్పాడు.


"వస్తాను సార్..!" అని రెండు చేతులు జోడించిఅక్కణ్నుంచి బయల్దేరాను.

రోడ్డుమీద నడుస్తుంటే ఒక్కటే ఆలోచన.... ఎంతో అనుభవజ్ఞునిలా ఆయన మాటలు బుర్రలో తిరుగుతున్నాయి.

ఏ వ్యాపారం చేయాలన్నా.. పోటీ.. పోటీ. కానీ... ఇప్పుడిప్పుడే డెవలప్ అవుతున్న ఇలాంటి వ్యాపారాన్ని మొదలుపెడితే ఎలా వుంటుంది.

నిజం! ఇలాంటి సంస్థలకు మంచి భవిష్యత్ వుంటుంది. కొందరి సరదాలు తీర్చి సంతోష పెడితే చాలు. మనకు సంపాదనే. ఈ బిజినెస్ కోసం అప్పుడే ప్రాజెక్ట్ రిపోర్ట నా బుర్రలో తిరుగుతుంది.







కథ

తల వెంట్రుక - తోటకూరపై

యమ్.వి.జె.భువనేశ్వరరావు
9290072130

"జుత్తునమ్మ ఏ కొప్పేసుకున్నా అందమే ... అని ఎన్నిసార్లు మొత్తుకన్నా వినరే ... తల ఊడి పోతుందని ఎంతగా మొర పెట్టుకన్నా వినిపించుకోరే... నన్నిలాగే వదిలేద్దామని నిర్ణయించుకున్నారా...."

వంట గదిలో నుండి గట్టిగా అరుస్తూ చెప్పింది అనసూయ. పత్రికా పఠనంలో మునిగి ఉన్న సుబ్బారావు విసురుగా లేచి, పేపర్ ప్రక్కన పడేసి, సరాసరి అనసూయ దగ్గరకి దూసుకెళ్ళాడు.

అతడి దూకుడు చూసి కంగారు పడింది అనసూయ. మరుగుతున్న నీటిలో పప్పేయ బోయి, ఉప్పేసేసింది. సుబ్బారావు అదేమీ పట్టించుకోకుండా... అనసూయ ముందుకెళ్ళి నిలబడ్డాడు.

మరుక్షణమే ఆరడుగుల పొడుగున్న సుబ్బారావు, తొలిసారిగా ఐదడుగుల అనసూయ ముందు తలవంచుకున్నాడు. సుబ్బారావు ముఖం చూడాలంటే... నిటారుగా తల ఎత్తాల్సిన శ్రమ పడాల్సి వచ్చేది.

ఆ ఇబ్బంది లేకుండా అనసూయకు అందుబాటులోనికి సుబ్బారావు తలకాయ వచ్చేసరికి అయోమయంగా అర్థం కానట్టు చూసింది.

సుబ్బారావు మానసిక ఆరోగ్యంపై అనుమానమూ కలిగింది.


"ఏమిటండీ... ఈ సమయంలో ఈ ప్రదేశంలో ఈ వింత చేష్టలు... నా ముందు మీరు తలదించుకోవటం...నేనడిగిందేమిటి? మీరు చేస్తున్నదేమిటి?" ప్రశ్నల వర్షం కురిపించింది.

మాడు మీద వ్రేలితో తడుతూ- "కన్పించ లేదా!" అనడిగాడు సుబ్బారావు.

ఇబ్బందిగా చూసింది అనసూయ.

"దాదాపుగా నా నెత్తి మీద జుత్తు మూడొంతులు ఖాళీ అయిపోయింది. ముందు నేను ట్రీట్‌మెంట్ తీసుకోవాలంటావా? నాలుగు వెంట్రుకలు ఊడిన నీకు ట్రీట్‌మెంట్ ఇప్పించమంటావా?" సూటిగానే అడిగాడు.

"ఆఁ! మీరే ముందు ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. ఆ బట్టతల మీద జుత్తూ మొలవదు. నేనూ మీలాగయ్యేక అప్పుడు ఇద్దరికీ కలిపి 'ఆఫర్'లో ట్రీట్‌మెంట్... ఇప్పిద్దురు గాని లెండి...'' కోపంగా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.



✦✦✦

వంట గ్యాస్ అయిపోయింది. స్టవ్‌లో మంట రావటం లేదు. క్రొత్త బండ పట్టుకొస్తే రండి... లేకుంటే క్యాంటీన్‌లో భోంచేసేయండి..."

అనసూయ కేకలు బాత్రూంలో నున్న సుబ్బారావు పక్కలో బాకుల్లా దిగాయ్.

"క్రొత్త సిలిండర్ తెచ్చి రెండ్రోజులయింది... అంతలోనే గ్యాస్ అయిపోవడమేమిటి?" అరిచాడు సుబ్బారావు.

"రెండ్రోజుల పాటు నాన్‌స్టాప్‌గా స్టవ్‌ను మండిస్తే... అయిపోక ఏం చేస్తుంది... ఇంకా సిమ్‌లో పెట్టాను. కాబట్టి రెండ్రోజులైనా వచ్చింది... లేకుంటే తెచ్చిన రోజే అయిపోయేది".

అనసూయ చెప్పింది విని అదిరిపడ్డాడు సుబ్బారావు.

"అదేంటి ... వంటయిపోయాక స్టవ్ మంట కట్టేయాలి కదా... కట్టడం లేదా?" లోపల్నుండే ప్రశ్నించాడు.

"మీరు కదా మొన్న అగ్గిపుల్లలు వేష్టు చేస్తున్నానని రోజంతా తిట్టిపోశారు... అందుకని ఒకే ఒక్క అగ్గి పుల్ల వెలిగించి... గ్యాస్ ఖాళీ అయిపోయేదాకా మరొక అగ్గిపుల్ల వేష్టు

చేయకుండా పొదుపు చేశానంటే నమ్మండి" అనసూయ గొప్పగా ఫీలవుతూ చెప్పింది.

సుబ్బారావుకి ఇంకోసారి చిర్రెత్తుకొచ్చింది.

"అగ్గిపుల్లను మిగల్చడం కోసం గ్యాసంతా తగలెడతావా? నీకసలు బుద్ధుందా?..." విరుచుకుపడ్డాడు.

"ఏమో... ఈ లెక్కలేవీ నాకు తెలీదు! నేను మీ అంత చదువుకున్న దాన్ని కాదు ... మీరేం తెస్తే అవే వండుతా... స్టవ్ వెలిగించమన్నప్పుడే వెలిగిస్తా! ఆపేయ్ మంటే ఆపేస్తా! ఇంటికి అవసరమయ్యే రేషన్‌తో సహా – మీరే తెచ్చి పడేయండి..." బొటపొటా కన్నీళ్ళు కార్చుకుంటూ విసవిసా బెడ్రూంలోకి పరుగెత్తి వెళ్ళిపోయింది అనసూయ.

✦✦✦

సుబ్బారావుకి తిండి అంటే మహా ప్రీతి. పప్పుచారు దప్పడం ఉంటే రెండు కేజీల అన్నం ఏమీ మిగల్చకుండా లాగించేయగలడు.

ఆ రోజు బుధవారం. క్యారియర్‌లోనికి 'దప్పడం' చెయ్యమని అనసూయకు ఆర్డర్ వేశాడు.

"వారం ఆఖరులో మిగిలిపోయిన కూరగాయలన్నీ వేసి దప్పడం చేస్తాం... ఇప్పుడు చెయ్యమంటే ఎలా? నా వల్ల కాదు... మంచివి వేసేస్తే ... ఏదో చేయకూడనిది చేసేసినట్లు తిట్టిపోస్తారు."

